



షణ్ముఖ

SHANMUKHAVELUGU

# వెలుగు

RNI : APTEL / 2023 / 89152

ప్రతి వార్త వెలుగు వైపు      తెలుగు దినపత్రిక

సంపుటి : 2 సంచిక : 221 ఎడిటర్ & పబ్లిషర్ : ఓబులశెట్టి రాధాకృష్ణ దాస్ మంగళవారం 08 జూలై 2025 పేజీలు 8 : వెల 3/-ఒంగోలు

VOLUME : 02 ISSUE : 221 EDITOR & PUBLISHER : OBULASETTY RADHAKRISHNA DASS PUBLISHED : ONGOLE Tuesday 08 July 2025 PAGES : 8 PRICE : 3/-





# టెక్నాలజీతో జీరో క్రైమ్ రేట్ సాధించాలి



- రియల్ టైమ్ గవర్నెన్స్ పై సీఎం చంద్రబాబు సమీక్ష
- క్రైమ్ హాట్ స్పాట్స్‌పై సీసీ కెమెరాలతో నిరంతర నిఘా
- ప్రభుత్వ రికార్డుల భద్రతకు బ్లాక్ చెయిన్ టెక్నాలజీ
- పిడుగులు పడే ప్రదేశంలో ముందుగానే సైరన్ హెచ్చరికలు

(షణ్ముఖ వెలుగు, అమరావతి,జూలై 06)

టెక్నాలజీని వినియోగించుకుని జీరో క్రైమ్ రేట్ స్టేట్ గా ఆంధ్రప్రదేశ్ ను తీర్చిదిద్దాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులకు సూచించారు. సాంకేతికత వినియోగించుకుని శాంతి భద్రతల పర్యవేక్షణలో ఆంధ్రప్రదేశ్ ను ఓ మోడల్ రాష్ట్రంగా మార్చాలని స్పష్టం చేశారు. సోమవారం నాడు ఏపీ సచివాలయంలో రియల్ టైమ్ గవర్నెన్సుపై ముఖ్యమంత్రి అధికారులతో సమీక్ష నిర్వహించారు. సీసీ కెమెరాలతో క్రైమ్ హాట్ స్పాట్లపై నిరంతరం నిఘా పెట్టి నేరాల నియంత్రణ చేయాలన్నారు. దీంతో పాటు ప్రైవేటు సీసీ కెమెరాల ఫుటేజి వ్యవహారంలోనూ నిబంధనలు మార్చేలా చర్యలు తీసుకోవాలని సీఎం ఆదేశించారు. నేరాల నియంత్రణకు ప్రైవేటు కెమెరాలను కూడా వినియోగించుకునేలా చూడాలని స్పష్టం చేశారు. రాజకీయ ముసుగులో నేరాలకు పాల్పడే వారి విషయంలో టెక్నాలజీని మరింతగా ఉపయోగించుకోవాలన్నారు. కొందరు తెలివిగా నేరాలు చేసి.. దాన్ని ప్రభుత్వంపై నెడుతున్నారని.. పోలీసులకు సహకరించని వ్యక్తులు, నేతల విషయంలో మరింత అప్రమత్తంగా ఉండాలని చంద్రబాబు సూచించారు. ఇలాంటి వారి కోసం పబ్లిక్ సేఫ్టీ యాక్టు కింద వారి వద్ద నుంచి డేటాను తీసుకునేందుకు చర్యలు చేపట్టాలని అన్నారు. ఆయా నేరాలకు బాధ్యులుగా చేసే అంశంపైనా దృష్టి పెట్టాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ప్రజా భద్రత కోసం.. నేరాల కట్టడి కోసం.. దర్యాప్తు నిమిత్తం.. షాపింగ్ మాల్స్, థియేటర్లు, హోటళ్ల వద్ద ఉండే సీసీ కెమెరాల్లోని ఫుటేజీని సేకరించే వంటి వాటి -మిగతా 2లో

## టీడీపీలో కష్టపడేవారికే పదవులు.. రాజీపడే ప్రసక్తే లేదు

గత పొరపాట్లు పునరావృతం కానివ్వం.. పార్టీలో సంస్కరణలు తెస్తామని వెల్లడి

ప్రతి 4 నెలలకోసారి కేడర్ ప్రజల్లోకి వెళ్లేలా ప్రత్యేక కార్యక్రమాలకు ప్రణాళిక




(షణ్ముఖ వెలుగు, అమరావతి,జూలై 06)

టీడీపీలో ఇకపై కష్టపడి పనిచేసే వారికే పదవులు దక్కుతాయని, ఈ విషయంలో ఎలాంటి రాజీకి తావులేదని పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మంత్రి నారా లోకేశ్ స్పష్టం చేశారు. పార్టీ కోసం పనిచేసిన వారిని గుర్తించి గౌరవించడమే తమ ప్రభుత్వ ప్రథమ కర్తవ్యమని ఆయన అన్నారు. నెల్లూరులోని అనిల్ గార్డెన్స్‌లో నిర్వహించిన ఉత్తమ కార్యకర్తల సమావేశంలో లోకేశ్ పాల్గొని కీలక ప్రసంగించారు.గతంలో జరిగిన పొరపాట్లను పునరావృతం చేయబోమని, పార్టీలో ఏమైనా తప్పులు జరిగితే సరిదిద్దుకోవడానికి సిద్ధంగా ఉన్నామని లోకేశ్ తెలిపారు. కార్యకర్తల అభీష్టం మేరకు ఈ నెలాఖరులోగా నామినేటెడ్ పదవులైన వ్యవసాయ మార్కెట్ కమిటీ (ఏఎంసీ), దేవాలయ కమిటీలను భర్తీ చేస్తామని హామీ ఇచ్చారు. పార్టీని క్షేత్రస్థాయి నుంచి బలోపేతం చేసేందుకు, ప్రతి నాలుగు నెలలకోసారి కార్యకర్తలు ప్రజల్లోకి వెళ్లేలా సరికొత్త కార్యక్రమాలను రూపొందిస్తున్నామని వివరించారు.

ఈ సందర్భంగా గత ప్రభుత్వంపై లోకేశ్ విమర్శలు గుప్పించారు. "సొంత కార్యకర్తలను కారు కింద తొక్కేసిన నేత జగన్. కనీసం వారిని పరామర్శించేందుకు కూడా వెళ్లలేదు. కానీ కందుకూరు దుర్ఘటన జరిగినప్పుడు చంద్రబాబు ప్రతి ఇంటికీ వెళ్లి క్షమాపణ చెప్పారు. మనకి, వాళ్లకి ఇదే తేడా" అని లోకేశ్ పేర్కొన్నారు. అధికారంలో ఉన్నా ప్రతిపక్షంలో ఉన్నట్లే ఆలోచించి, ప్రజలతో మమేకమై పనిచేయాలని -మిగతా 2లో

## శ్యామా ప్రసాద్ ముఖర్జీ వల్లే భారత్‌లో కశ్మీర్ భాగమైంది: షా

(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ,జూలై 06)

భారతీయ జనసంఘ్ వ్యవస్థాపకుడు శ్యామా ప్రసాద్ ముఖర్జీ లేకపోతే కశ్మీర్ భారత్‌లో ఎన్నటికీ కలిసేది కాదని కేంద్ర హోంమంత్రి అమిత్ షా పేర్కొన్నారు. శ్యామా ప్రసాద్ ముఖర్జీ జయంతి పురస్కరించుకుని ఆయనకు అమిత్‌షా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా గుజరాత్‌లోని ఆణంద్‌లో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మాట్లాడుతూ.. దేశానికి ముఖ్యంగా జమ్మూకశ్మీర్ కోసం ఆయన చేసిన త్యాగాలు, సేవలను స్మరించుకున్నారు. "జమ్మూకశ్మీర్‌కు ప్రత్యేక హోదాను కల్పించే భారత రాజ్యాంగంలోని 370 ఆర్టికల్‌ను శ్యామా ప్రసాద్ ముఖర్జీ తీవ్రంగా వ్యతిరేకించారు. -మిగతా 2లో



## అసెంబ్లీకి రాలేని జగన్ ప్రతిపక్షానికి కూడా పనికిరారు: దేవినేని ఉమా

జగన్ కేసుల విచారణను వేగవంతం చేయాలని దేవినేని ఉమా డిమాండ్

బెయిల్ పై ఉంటూ చట్టబద్ధ సంస్థలను బెదిరిస్తున్నారని ఆరోపణ

11 సీట్లు వచ్చినా వైసీపీ నేతలు బుద్ధి మార్చుకోవడం లేదని మండిపాటు

(షణ్ముఖ వెలుగు, అమరావతి,జూలై 06)

మాజీ ముఖ్యమంత్రి, వైసీపీ అధినేత జగన్ పై టీడీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. అసెంబ్లీకి రాలేని జగన్ ఒక పిరికిపందని, ఆయన ప్రతిపక్ష నేతగా కూడా కొనసాగేందుకు అనర్హుడని ఎద్దేవా చేశారు. అమరావతిలోని టీడీపీ -మిగతా 2లో




## మా సంపూర్ణ మద్దతు ఆర్జేడీకే అఖిలేశ్ ప్రకటన



(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ,జూలై 06)

త్వరలో జరగనున్న బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో తమ పూర్తి మద్దతు ఆర్జేడీ(%ఫ్రఅఈ%)కేనని సమాజ్‌వాదీ పార్టీ చీఫ్, యూపీ మాజీ సీఎం అఖిలేశ్ యాదవ్ ప్రకటించారు. ఈ ఎన్నికల ప్రచారంలో ఉత్తర్‌ప్రదేశ్‌లో భాజపా సర్కార్ కుంభకోణాలను బయటపెడతామన్నారు. సోమవారం లఖ్‌నవూలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. "మా సంపూర్ణ మద్దతు లాలూప్రసాద్ యాదవ్, తేజస్వీ యాదవ్‌లకే. యూపీలో భాజపా చేసిన కుంభకోణాలను బిహార్ ఎన్నికల ప్రచారంలో బయటపెడతాం. ప్రజలకు వాస్తవాలను చెబుతాం" అన్నారు.

నీతీశ్ కుమార్‌ని మరోసారి సీఎంని చేసే ఉద్దేశం భాజపాకు లేదని అఖిలేశ్ విమర్శించారు. ఆయన్ను బలవంతంగా రిటైర్ అయ్యేలా చేస్తుందన్నారు. భాజపా నీతీశ్‌ను ఉపయోగించుకుంటోందనీ.. కానీ మళ్లీ ఆయన్ను సీఎంని చేయరన్నారు. "ఒకప్పుడు మేం ఆయన్ను ప్రధానిగా చూపించాలనుకున్నాం. కానీ ఇప్పుడు చూడండి. నీతీశ్ సీఎం పదవి నుంచి కూడా రిటైర్ అవుతారు" అన్నారు. దేశం ఎదుర్కొంటున్న మౌలిక సమస్యల నుంచి భాజపా ప్రజల దృష్టిని మళ్లిస్తోందని మండిపడ్డారు. మౌలిక సమస్యలపై చర్చను భాజపా ఇష్టపడటం లేదన్న అఖిలేశ్.. యూపీ ప్రజలు మాత్రం ఎన్నికల కోసం వేచి చూస్తున్నారన్నారు. 2027లో జరిగే యూపీ అసెంబ్లీ ఎన్నికలు మాత్రం ఇంతకుముందెన్నడూ చూడని మాదిరిగా ఉంటాయని వ్యాఖ్యానించారు.

## జీరో పావర్టీ దిశగా రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తాం

(షణ్ముఖ వెలుగు, అమరావతి,జూలై 06)

జీరో పావర్టీ దిశగా రాష్ట్రాన్ని ముందుకు తీసుకెళ్తామని మంత్రి అనగాని సత్యప్రసాద్ అన్నారు. అందుకోసం నియోజకవర్గాలు, జిల్లాలవారీగా అభివృద్ధి ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు చెప్పారు. తిరుపతి జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి అనగాని అధ్యక్షతన స్వర్ణాంధ్ర విజన్, పీ-4పై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. "విజన్ ప్లాన్ తయారీకి ఎమ్మెల్యేలు ప్రత్యేక శ్రద్ధ వహించాలి. వ్యవసాయ, పరిశ్రమ, సేవారంగాల్లో అవకాశాలు -మిగతా 2లో




## వ్యవసాయరంగం అభివృద్ధికి సహకరించండి.. కేంద్రానికి అచ్చెన్న విజ్ఞప్తి

(షణ్ముఖ వెలుగు, అమరావతి,జూలై 06)

గత వైకాపా ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని పట్టించుకోలేదని మంత్రి అచ్చెన్నాయుడు మండిపడ్డారు. కేంద్ర పథకాలను సైతం గాలికి వదిలేసిందన్నారు. సోమవారం దిల్లీలో పర్యటించిన ఆయన.. కేంద్ర వ్యవసాయశాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌తో భేటీ అయ్యారు. రాష్ట్రంలో వ్యవసాయ రంగానికి కేంద్రం నుంచి సహకారం కావాలని కోరారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. " ఏపీలో దాదాపుగా 64 శాతం మంది వ్యవసాయం, వ్యవసాయ అనుబంధ రంగాలపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. అందుకు ప్రభుత్వాలు ఈ రంగానికి ప్రాధాన్యత ఇస్తున్నాయి. కానీ, గత వైకాపా ప్రభుత్వం మాత్రం వ్యవసాయరంగాన్ని పూర్తిగా -మిగతా 2లో



## భారత్ లో మైనారిటీలు బందీలుగా బతుకుతున్నారు

రిజిజు వ్యాఖ్యలపై ఒవైసీ ఫైర్

మైనార్టీలకు అధిక ప్రయోజనాలంటూ కేంద్ర మంత్రి రిజిజు వ్యాఖ్యలు

మేం బందీలుగా బతుకుతున్నామంటూ తీవ్రంగా స్పందించిన అసదుద్దీన్

ముస్లిం విద్యార్థుల స్కాలర్‌షిప్‌ల రద్దును ప్రస్తావించిన ఒవైసీ

(షణ్ముఖ వెలుగు, అమరావతి,జూలై 06)

దేశంలో మైనార్టీలు పౌరులుగా కాకుండా బందీలుగా బతుకుతున్నారంటూ ఏఐఎంఐఎం అధినేత, ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. భారతదేశంలో మెజారిటీ వర్గాల కంటే మైనార్టీలకే ఎక్కువ ప్రయోజనాలు, రక్షణ లభిస్తోందంటూ కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు చేసిన వ్యాఖ్యలపై ఆయన సోమవారం ఘాటుగా స్పందించారు. రిజిజు వ్యాఖ్యలు వాస్తవాలను వక్రీకరించేలా ఉన్నాయని, ముస్లింలు ఎదుర్కొంటున్న వివక్షను ఆయన విస్మరించారని మండిపడ్డారు.ఎక్స్ వేదికగా అసదుద్దీన్ ఒవైసీ సుదీర్ఘ పోస్టులో తన ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. "భారతదేశంలో మైనార్టీలు రెండో తరగతి పౌరులుగా కూడా లేరు. మేమిప్పుడు బందీలం" అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర మంత్రి చెబుతున్న ప్రయోజనాలు ఏమిటో చెప్పాలని ఒవైసీ నిలదీశారు. "ప్రతిరోజూ పాకిస్థానీ, బంగ్లాదేశీ, జిహాదీ అంటూ పిలిపించుకోవడం ప్రయోజనమా? మూకదాడుల్లో ప్రాణాలు కోల్పోవడమే రక్షణా? మా ఇళ్లు, మసీదులను చట్టవిరుద్ధంగా కూల్చివేయడాన్ని చూస్తూ ఉండటం ప్రత్యేక హక్కా? సాక్షాత్తు ప్రధానమంత్రి నుంచి విద్వేష ప్రసంగాలను ఎదుర్కోవడం గౌరవమా?" అని ఆయన ప్రశ్నల వర్షం కురిపించారు.రిజిజు ఒక చక్రవర్తిలా కాకుండా, రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉన్న వ్యక్తిలా మాట్లాడాలని ఒవైసీ హితవు పలికారు. "మైనార్టీల హక్కులు ప్రాథమిక హక్కులే కానీ, ఎవరూ ఇస్తున్న భిక్ష కాదు" అని ఆయన స్పష్టం చేశారు. వక్ఫ్ సవరణ చట్టాన్ని -మిగతా 2లో



## అల్లర్లు సృష్టించేందుకు వైకాపా నేతల కుట్ర

ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్

(షణ్ముఖ వెలుగు, అమరావతి,జూలై 06)

"పొన్నూరు నియోజకవర్గంలోని మన్నవ గ్రామంలో యాదృచ్ఛికంగా జరిగిన ఘటనను అడ్డం పెట్టుకుని అల్లర్లు సృష్టించేందుకు వైకాపా నేతలు కుతంత్రాలు -మిగతా 2లో



**మొదటిపేజీ తరువాయి**

# టెక్నాలజీతో జీరో క్రైమ్ రేట్ సాధించాలి

విషయాల్లోనూ పబ్లిక్ సేఫ్టీ యాక్టును వర్తింప చేయాలన్నారు. మరోవైపు వివిధ రంగాల్లో డ్రోన్లు, సీసీ కెమెరాల వినియోగం పెంచాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ఓర్వకల్లులో డ్రోన్ సిటీ పురోగతిపైనా అధికారుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు.

ప్రభుత్వ రికార్డుల భద్రతకు బ్లాక్ చెయిన్ టెక్నాలజీ

వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన రికార్డులు, డేటా భద్రతకు బ్లాక్ చెయిన్ టెక్నాలజీని వినియోగించాలని ముఖ్యమంత్రి సూచించారు. ప్రస్తుతం రెవెన్యూ రికార్డులను కూడా పూర్తి స్థాయి ప్రక్షాళన చేసి నూతన సాంకేతికతనే వినియోగించి భద్రంగా ఉండేలా చూడాలన్నారు. వివిధ ప్రభుత్వ శాఖలకు సంబంధించిన సమాచారం డేటా లేక్ ద్వారా సమన్వయం చేయాలని సీఎం స్పష్టం చేశారు. మరోవైపు 517 పౌరసేవల్ని వాట్సప్ గవర్నెన్సు ద్వారా అందిస్తున్నట్టు అధికారులు వివరించారు. అయితే అందిస్తున్న సేవలన్నీ యూజర్ ఫ్రెండ్లీగా ఉండేలా చూడాలని ముఖ్యమంత్రి ఆదేశించారు.

పిడుగులు పడే ప్రాంతాల్లో విలువైన ప్రాణాలు కాపాడటమే లక్ష్యంగా పనిచేయాలని.. ముందస్తు హెచ్చరికల వ్యవస్థ సమర్థంగా పనిచేసేలా చూడాలని సీఎం స్పష్టం చేశారు. ముందుగానే ఆయా ప్రాంతాల్లో సైరన్ మోగేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. భూగర్భ జలాల పర్యవేక్షణకు ఫీజియో మీటర్లు, సెన్సార్లు త్వరితగతిన పునరుద్ధరించాలని అన్నారు.

రిజర్వాయర్లలో ప్రస్తుతం ఉన్న నీరెంత, ఎంతమేర ప్రవాహాలు వస్తున్నాయి. సముద్రంలోకి విడుదల చేస్తున్న నీరెంత లాంటి వివరాలు నమోదు చేయాలన్నారు. రిజర్వాయర్లలో వచ్చే ప్రవాహాలకు సంబంధించిన వివరాలను రియల్ టైమ్ లో పర్యవేక్షిస్తే వరద నిర్వహణ చేయొచ్చన్నారు. ప్రస్తుతం వస్తున్న ప్రవాహాలతో రాష్ట్రంలోని అన్ని రిజర్వాయర్లనూ పూర్తి సామర్థ్యంతో నింపుతున్నట్టు సీఎం స్పష్టం చేశారు. మరోవైపు సముద్ర తీరప్రాంతాల్లో అలల ఉధృతి, చేపల వేటకు అవకాశం ఉన్న ప్రాంతాలపై ఇన్ కాయిస్ సంస్థ ఇచ్చే వివరాలను మత్స్యకారులకు, తీరప్రాంతాల్లోని వారికి అందేలా చూడాలని స్పష్టం చేశారు.

ప్రజల అవసరాలకు అనుగుణంగా పథకాల రూపకల్పన

ప్రతీ ప్రభుత్వ శాఖ తమ దగ్గర ఉన్న లబ్ధిదారుల డేటా సహా ఇతర వివరాలను ఆర్టీజీఎస్ తో సమన్వయం చేసుకోవాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. క్షేత్రస్థాయిలో వ్యత్యాసం ఉంటే తక్షణం ఆర్టీజీఎస్ కు తెలిపి డేటాను సవరించుకోవాలని స్పష్టం చేశారు. 2029 నాటికి పేదరిక రహిత రాష్ట్రంగా ఏపీని తీర్చిదిద్దటమే లక్ష్యంగా పనిచేస్తున్నామని అందుకు తగినట్టుగా సంక్షేమ పథకాల రూపకల్పన జరగాలని ముఖ్యమంత్రి అన్నారు.

పేదరిక నిర్మూలన కోసం చివరి వ్యక్తి వరకూ చేయూత అందించటమే కూటమి ప్రభుత్వ ఆలోచన అని అన్నారు. పీ4లో భాగంగా బంగారు కుటుంబం- మార్గదర్శి అనుసంధాన ప్రక్రియ నిరంతరం కొనసాగాలని సీఎం స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి నిర్వహించిన ఈ సమీక్షకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్, ఐటీ శాఖ కార్యదర్శి కాటమనేని భాస్కర్ ఇతర ఉన్నతాధికారులు హాజరయ్యారు

# టీడీపీలో కష్టపడేవారికే పదవులు.. రాజీపడే ప్రసక్తే లేదు

ఆయన కేడర్‌కు సూచించారు.ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రతి కార్యకర్త ఇంటింటికీ తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ ఇచ్చిన హామీలను నిలబెట్టుకుంటున్నామని, త్వరలోనే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం, ఈ ఏడాదిలోనే నిరుద్యోగ భృతి అందిస్తామని ప్రకటించారు. మెగా డీఎస్సీ ద్వారా 16,347 పోస్టులను భర్తీ చేస్తున్నామని, మిగిలిన ఉద్యోగాలను కూడా పద్ధతి ప్రకారం భర్తీ చేస్తామని లోకేశ్ భరోసా ఇచ్చారు. ఈ సమావేశంలో మంత్రులు పొంగూరు నారాయణ, ఎన్ఎండీ ఫరూక్, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, జిల్లా టీడీపీ అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్, పలువురు ఎమ్మెల్సీలు, ఇతర ముఖ్య నేతలు పాల్గొన్నారు.

# శ్యామా ప్రసాద్ ముఖర్జీ వల్లే భారత్‌లో కశ్మీర్ భాగమైంది: షా

కశ్మీర్‌కు స్వయంప్రతిపత్తి కల్పించకుండా భారత్‌లోనే పూర్తిగా విలీనం చేయాలని వాదించారు. అలాగే బెంగాల్ ఈ రోజున భారత్‌లో భాగంగా ఉండటానికీ కూడా శ్యామా ప్రసాద్ ముఖర్జీ, స్వామి ప్రణవానందే కారణం" అని అమిత్ షా అన్నారు. ఇక 10 మందితో ప్రారంభించిన భారతీయ జనసంఘ్ ఇప్పుడు ప్రపంచంలోనే అతి పెద్ద రాజకీయ పార్టీగా అవతరించిందని పేర్కొన్నారు. అనంతరం ఆయన అమూల్ డైరీ నాల్గో వార్షికోత్సవంలో పాల్గొన్నారు. సహకార రంగం పని సంస్కృతిలో పారదర్శకత, సాంకేతికత, ప్రజా సంక్షేమాన్ని అంతర్భాగం చేయాలని వాణిజ్య సంస్థలకు పిలుపునిచ్చారు.

# అసెంబ్లీకి రాలేని జగన్ ప్రతిపక్షానికి కూడా పనికిరారు: దేవినేని ఉమా

కార్యాలయంలో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.బెయిల్‌పై బయట ఉన్న జగన్, చట్టాలను కాపాడే వ్యవస్థలనే బెదిరించేలా వ్యవహరించడం దారుణమని దేవినేని ఉమ అన్నారు. ప్రజాస్వామ్యం, న్యాయస్థానాలంటే ఆయనకు ఏమాత్రం గౌరవం లేదని విమర్శించారు. జగన్‌పై ఉన్న కేసుల విచారణను పోలీసు, న్యాయవ్యవస్థలు ఒక సవాలుగా స్వీకరించి, త్వరితగతిన పూర్తి చేయాలని ఆయన కోరారు. వైఎస్ హయాంలో పెట్టిన కేసుల కోసం తాను ఇప్పటికీ కోర్టుల చుట్టూ తిరుగుతున్నానని గుర్తుచేశారు.గత ఐదేళ్లలో జగన్ చేయలేని అభివృద్ధిని, ముఖ్యమంత్రి చంద్రబాబు ఏడాది కాలంలోనే చేసి చూపించారని ఉమ స్పష్టం చేశారు. "ఒక్క ఛాన్స్" అని అధికారంలోకి వచ్చి రాష్ట్రాన్ని నాశనం చేశారని, ఇప్పుడు మళ్లీ సింగయ్య శవం లాంటి ఘటనలతో కుయుక్తులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ప్రజలు 11 సీట్లకు పరిమితం చేసినా వైసీపీ నేతల బుద్ధి మారడం లేదని, ఇంకా కుట్రలు పన్నుతున్నారని మండిపడ్డారు. ఇలాంటి కుతంత్రాలు మానుకోకపోతే ప్రజలే వైసీపీని తరిమి తరిమి కొడతారని దేవినేని ఉమ హెచ్చరించారు.

# జీరో పావర్టీ దిశగా రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తాం

అందిపుచ్చుకోవాలి. తిరుపతి జిల్లాను మొదటిస్థానంలో నిలబెట్టాలి. బంగారు కుటుంబాల జీవన ప్రమాణాలు పెరిగేలా చర్యలు తీసుకుంటాం" అని అన్నారు. 2018లో తెదేపా ప్రభుత్వమే మామిడి రైతులను ఆదుకుందని గుర్తు చేశారు. మళ్లీ ఇప్పుడు కూడా కిలోకు రూ.4 అదనంగా ఇచ్చి ఆదుకున్నామన్నారు.

# వ్యవసాయరంగం అభివృద్ధికి సహకరించండి.. కేంద్రానికి అచ్చెన్న విజ్ఞప్తి

గాలికి వదిలేసింది. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కార్యక్రమాలను కూడా వినియోగించుకోకపోవడం వల్ల రాష్ట్రంలో వ్యవసాయ రంగం కుదేలైంది. మళ్లీ దానిని గాడిన పెట్టాలంటే కేంద్రం సహకరించాలి" అని అచ్చెన్నాయుడు తెలిపారు.

# భారత్ లో మైనారిటీలు బందీలుగా బతుకుతున్నారు

ప్రస్తావిస్తూ, హిందూ ఎండోమెంట్ బోర్డులలో ముస్లింలు సభ్యులుగా ఉండలేరని, కానీ వక్ఫ్ బోర్డులలో ముస్లిమేతరులు సభ్యులుగా చేరి మెజారిటీ సాధించేలా చట్టం చేశారని విమర్శించారు.

ప్రభుత్వ విధానాల వల్ల ముస్లిం విద్యార్థులు నష్టపోతున్నారని ఒవైసీ ఆరోపించారు. మౌలానా ఆజాద్ నేషనల్ ఫెలోషిప్, ప్రీ-మెట్రిక్ స్కాలర్‌షిప్‌లను రద్దు చేయడాన్ని ఆయన గుర్తుచేశారు. ప్రభుత్వ గణాంకాల ప్రకారమే ఉన్నత విద్యలో ముస్లింల సంఖ్య గణనీయంగా పడిపోయిందని తెలిపారు. భారతీయ ముస్లింల పిల్లలు వారి తల్లిదండ్రుల కంటే అధ్వాన్న స్థితిలో ఉన్నారని, తరతరాల అభివృద్ధి తిరోగమనంలో ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. తాము మెజారిటీ వర్గాల కన్నా ఎక్కువ ఏమీ కోరడం లేదని, రాజ్యాంగం హామీ ఇచ్చిన సామాజిక, ఆర్థిక, రాజకీయ న్యాయాన్ని మాత్రమే డిమాండ్ చేస్తున్నామని ఒవైసీ స్పష్టం చేశారు.

# అల్లర్లు సృష్టించేందుకు వైకాపా నేతల కుట్ర

చేస్తున్నారు. దాడిలో గాయపడ్డ నాగమల్లేశ్వరరావుకు మెరుగైన వైద్యం అందకుండా చేసి, ఏదోవిధంగా చనిపోయేలా చేయాలని పొన్నవోలు సుధాకర్‌రెడ్డి, లేళ్ల అప్పిరెడ్డి, అంబటి రాంబాబు, అంబటి మురళీ ఇతర నేతలు కుట్ర పన్నారు" అని తెదేపా సీనియర్ నేత, ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ ఆరోపించారు.

గుంటూరులో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. "నాగమల్లేశ్వరరావుపై దాడి ఘటనకు సంబంధించి అంబటి సోదరులతో పాటు వైకాపాలోని కొందరు నేతలు నోటికొచ్చినట్లు మాట్లాడుతున్నారు. వైకాపా ప్రభుత్వంలో వారు చేసినట్లు.. ఇప్పుడు మేము వ్యవహరిస్తే అంబటి రాంబాబు, పేర్ని నాని వంటి వారు బయట తిరిగేవారు కాదు. జగన్ వాహనం కిందపడి సింగయ్య చనిపోతే.. ఆయన భార్యను వైకాపా కార్యాలయానికి పిలిపించుకుని, బెదిరించి అంబులెన్స్‌లో ఏదో జరిగిందని చెప్పించడం చూస్తుంటే వారి నేరచరిత్ర అర్థమవుతుంది. ఈ కేసు నుంచి బయటపడేందుకు రూ.కోటి చేతులు మారినట్లు సమాచారం. నాగమల్లేశ్వరరావుపై దాడి జరిగిన టీ స్టాల్ ప్రాంతం వైకాపా వారిదే. ఘటన జరిగిన తర్వాత నాగమల్లేశ్వరరావును అంబులెన్స్‌లో కాకుండా ఆటోలో ఎందుకు తరలించారు? ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లకుండా.. వైకాపా నాయకురాలికి చెందిన హాస్పిటల్‌లో ఎందుకు చేర్పించారు? దాడి సమయంలో ఐదుగురు వైకాపా కార్యకర్తలు అక్కడ ఎందుకున్నారో పోలీసులు దర్యాప్తులో తేల్చాలి' అని ధూళిపాళ్ల డిమాండ్ చేశారు.

# ఏపీ స్పెషల్ పోలీస్ బేటాలియన్ నూతన కార్యాలయాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే విజయకుమార్





(షణ్ముఖ వెలుగు, మద్దిపాడు, జులై 7)

మండలంలోని అన్నంగి గ్రామం దగ్గర ఏపీ స్పెషల్ పోలీస్ బేటాలియన్ నూతన కార్యాలయంను సంతనూతలపాడు నియోజకవర్గ ఎమ్మెల్యే బిఎన్ విజయ్ కుమార్ పరిశీలించారు. అసిస్టెంట్ కామండర్ జనార్దన్‌రెడ్డి, ఆర్ఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐ శివ రామయ్య, పోతినేని శ్రీనివాసరావు, తదితరులు పరిశీలించారు.

# జులై 9 సార్వత్రిక సమ్మె జయప్రదానికై ఒంగోలులో బైక్ ర్యాలీ



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జులై 7)

జులై 9 సార్వత్రిక సమ్మె జయప్రదానికై ఒంగోలులో కార్మిక సంఘాల ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ జరిగింది. ఒంగోలులోని నెల్లూరు బస్టాండు దగ్గరనుంచి ఆర్టీసీ బస్టాండ్ వరకు ఈ ర్యాలీ కొనసాగింది. ఆర్టీసీ బస్టాండ్‌లో సభ జరిగింది .ఈ సభకు సిఐటియు జిల్లా కార్యదర్శి గంటీనపల్లి శ్రీనివాసులు అధ్యక్షతన జరిగింది. ఈ సభలో రైతుకూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిట్టిపాటి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ నాలుగు లేబర్ కోడ్ రద్దు చేయాలని పెంచిన పనిగంటలు తగ్గించాలని , సమ్మె జరుగుతా ఉంది. మొత్తం జిల్లాలోని ఉద్యోగులు కార్మికులు ప్రజలందరూ కూడా సహకరించాలని మనవి చేశారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు జివి కొండారెడ్డి మాట్లాడుతూ అంగన్వాడి, ఆశ, మధ్యాహ్నం భోజనం, వారిని గుర్తించి కనీస వేతనం 26,000 ఇవ్వాలని చెప్పి డిమాండ్ చేయడం జరిగింది. ఏఐఎఫ్‌టియు న్యూ జిల్లా కార్యదర్శి ఎంఎస్ సాయి మాట్లాడుతూ ప్రభుత్వ రంగాన్ని కాపాడాలని చెప్పి డిమాండ్ చేయడం జరిగింది. ఏఐటీయు సీ జిల్లా కార్యదర్శి కే వెంకటేశ్వర్లు మాట్లాడుతూ మునిసిపల్ కార్మికుల్ని పంచాయతీ కార్మికులని వేతనాలు పెంచి రెగ్యులర్ చేయాలని చెప్పి డిమాండ్ చేయడం జరిగింది. ఇంకా ఈ కార్యక్రమంలో సిఐటియు నగర కార్యదర్శి టీ మహేష్ సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు చీకటి శ్రీనివాసరావు, తంబి శ్రీనివాసులు, ధామ శ్రీనివాసులు, బివి రావు, జి శేషయ్య, సిహెచ్ రాంబాబు, మున్వర్ భాష, సలార్, శ్రామిక మహిళా జిల్లా కన్వీనర్ కల్పన, చిరంజీవి, క్రిష్ణ మోహన్, బ్యాంక్ నాయకులు సుబ్బారావు, దాసరి సుందరం, రాజశేఖర్, పద్మ, తదితరులు, పాల్గొన్నారు.

# కుక్కల బెడద నుంచి మమ్మల్ని రక్షించండి



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జులై 7)

ఒంగోలు పట్టణంలోని భాగ్యనగర్ 5వ అడ్డరోడ్‌లో ఓంశాంతి నిర్వాకులు రాకేష్ అనువారి ఇంటిలో పెంచుకుంటున్న కుక్కల వలన చాలా ఆస్తి నష్టం జరుగుతుందని, కుక్కలు ఇంట్లో ఉన్న చెప్పులు, బట్టలను చింపడం, బయట ఉండే ఆటోలు, బైకులు సీట్లను కొరకటం 5వ అడ్డరోడ్డులోని మహిళలు కలెక్టరేట్లోని స్పందనలో డిఆర్ఓ ఓబులేస్‌కి వినతి పత్రం సమర్పించడం జరిగింది. ఈ సందర్భంగా వాళ్లు మాట్లాడుతూ కుక్కలు చిన్నపిల్లలను వెంబడించి భయభ్రాంతులకు గురి చేయడం జరుగుతుందన్నారు. రెండు సంవత్సరముల నుండి వారికి ఎన్నిసార్లు చెప్పినా వారు వినకుండా మా వెనక అధికారులు ఉన్నారని, మీరు మమ్మల్ని ఏమి చేయలేరని వారు బెదిరిస్తున్నారని తెలిపారు. మున్సిపాలిటీ అధికారులచే విచారించి కుక్కల బెడద నుండి విముక్తి చేయాలని వాళ్లు కోరారు. అర్జీ ఇచ్చిన వారిలో కొమ్మనూరి రూతు, సాలిబాయి, కే సాలమ్మ, సిహెచ్ యశ్వంతు, ఏ రమాదేవి, హమ్‌తుల్లా స్నీషా, కే రవి, తదితరులు ఉన్నారు.

# యర్రగొండపాలెంలో సుపరిపానలో తొలి అడుగు కార్యక్రమం



## పాల్గొన్న వైపాలెం టీడీపీ ఇన్‌ఛార్జి ఎరిక్షన్ బాబు, పరిశీలకులు నాదెండ్ల బ్రహ్మం

(షణ్ముఖ వెలుగు, యర్రగొండపాలెం టౌన్, జులై 7)

యర్రగొండపాలెం పట్టణంలోని 18, 19వ బూత్ పరిధిలో స్టేట్ బ్యాంక్ వెనుక బజారులో సుపరిపాలనలో తొలి ఏడాది సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో యర్రగొండపాలెం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ గూడూరి ఎరిక్షన్ బాబు, పరిశీలకులు నాదెండ్ల బ్రహ్మం చౌదరి పాల్గొన్నారు. సుపరిపాలనలో భాగంగా ప్రతి ఒక్కరూ సంతోషం వ్యక్తం చేస్తున్నారని, సంక్షేమం, అభివృద్ధి దిశగా రాష్ట్రం ప్రయాణిస్తుందని తెలిపారు. అనంతరం ఇంటింటికి వెళ్లి కరపత్రాలను పంపిణీ చేసి ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో మండల టీడీపీ కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.





షణ్ముఖ వెలుగు
ePaper
www.shanmukhavelugu.com
3 08.07.25 మంగళవారం

షణ్ముఖ వెలుగు
ప్రతి వార్త వెలుగు వైపు
తెలుగు దినపత్రిక
ప్రకాశం

# నాకేం తెలియదు

## షణ్ముఖ వెలుగుతో ఆశా రాంబాబు


వెలుగు
రాంబాబా మజాకా...!!
రాంబాబు అకౌంట్‌లోకి రూ.18 లక్షలు
ప్రభుత్వ సొమ్ము స్వాహా అయినా పట్టించుకోని జిల్లా యంత్రాంగం
పుల్లలచెరువు మేజర్ పంచాయతీలో సంచలనం
సర్పంచ్‌కు తెలియకుండానే భారీ నిధుల వినియోగం


**(షణ్ముఖ వెలుగు బ్యూరో, ప్రకాశం, జులై 7)**

రాంబాబా మజాకా అనే కథనం షణ్ముఖ వెలుగు దినపత్రికలో సోమవారం ప్రచురితమైంది. అయితే ఈ కథనం పై ఆశా రాంబాబు షణ్ముఖ వెలుగు ప్రతినిధులతో చర్చించారు. ఆ వ్యవహారంలో తనకేమీ సంబంధం లేదన్నారు. పంచాయతీ కార్యదర్శి తనకు కొంత నగదు ఇచ్చి సంతకాలు చేయమంటే చేశానని, తన అకౌంట్‌లో నగదు జమ అయిన వెంటనే సదరు పంచాయతీ కార్యదర్శి సొమ్మంతా తీసుకున్నారన్నారు. ఈ విషయం మండలంలో ప్రతి అధికారికి తెలుసన్నారు. తనకు సంబంధం లేని వ్యవహారంలో తన పేరు రాయవద్దని మొర పెట్టుకున్నారు. ఓ ప్రభుత్వ అధికారి ఈ విధంగా పనులు చేయకుండా బిల్లులు చేయడమే కాక ఆ బిల్లులను ఏమీ తెలియని, ఎవరికి సంబంధం లేని ఆశా రాంబాబు అకౌంట్‌లో జమ చేసి రూ.18 లక్షలు దర్జాగా దోచుకున్న పంచాయతీ కార్యదర్శి రాంబాబును బలి పశువును చేశాడని చెప్పడంలో సందేహం లేదు. అయితే ఈ పంచాయతీ కార్యదర్శి చేతివాటం తెలుసుకున్న అధికార పార్టీ నేతలు తమ జేబులు నింపడానికి ఇలాంటా కార్యదర్శి కావాలని ఏరి కోరి మరి వారికి కావాల్సిన స్థానాల్లోకి బదిలీ చేయించి అక్కడి గ్రామ పంచాయతీల్లో నిధులు కాజేస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. ప్రభుత్వ ఖజానాకు గండికొడుతున్న సదరు పంచాయతీ కార్యదర్శి పై ఇప్పటికైనా జిల్లా అధికార యంత్రాంగం చర్యలు తీసుకుని ఒక్క పంచాయతీలోనే కాజేసిన రూ.18 లక్షలు ప్రభుత్వ ఖజానాకు జమ చేస్తారో లేక మనం కూడా వాటాలు పంచుకుందామని ఆలోచనలు చేస్తారో కాలమే నిర్ణయించాలి మరి....!

# అక్షర ఆంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలి

### జిల్లా ఇన్‌ఛార్జి కలెక్టర్ ఆర్ గోపాలకృష్ణ



**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జులై 7)**

నిరక్షరాస్యులైన వయోజనులను కూడా అక్షరాస్యులుగా మార్చే ' అక్షర ఆంధ్ర ' కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా ఇన్‌ఛార్జి కలెక్టర్ ఆర్ గోపాలకృష్ణ ఆదేశించారు. ఇందుకు సంబంధించి వివిధ శాఖల అధికారులతో కూడిన సమన్వయ కమిటీ సమావేశం సోమవారం ఆయన అధ్యక్షతన ప్రకాశం భవనములో జరిగింది. వయోజన విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ' ఉల్లాస్ ' పథకంలో భాగంగా 2025 - 26 విద్యా సంవత్సరంలో ' అక్షర ఆంధ్ర ' అనే ప్రత్యేక సాక్షరత కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించినట్లు వయోజన విద్యాశాఖ డిప్యూటీ డైరెక్టర్ జగన్‌మోహన్ రావు ఈ సందర్భంగా వివరించారు. 2029 సంవత్సరం నాటికి 15 - 59 సంవత్సరముల వయసుగల వారందరూ చదవటం, రాయటం నేర్చుకునేలా చేయటమే ఈ కార్యక్రమం ఉద్దేశం అని చెప్పారు. ఇందులో భాగంగా ఈ విద్యా సంవత్సరంలో జిల్లాలో 1,29,497 ని అక్షరాస్యులుగా చేయాల్సి ఉందన్నారు. ఇప్పటికే వీరిని గుర్తించినందున వాలంటీర్ టీచర్లకు అనుసంధానం చేసి అక్షరాస్యులుగా తీర్చి దిద్దాలనేది రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని ఆయన వివరించారు. ప్రతిరోజు సాయంత్రం ఐదు నుంచి ఏడు గంటల మధ్య అంగన్వాడీ కేంద్రాలు, కమ్యూనిటీ సెంటర్లు, పాఠశాల భవనా లలో వీరికి బోధించేలా కార్యాచరణ ప్రణాళికను రూపొందించినట్లు చెప్పారు. మొత్తం 100 గంటలపాటు పాఠ్యాంశాల బోధన ఉంటుందని, ఇందులో 15 గంటలు (తరువాయి 4లో...)

# బంగారు భవిష్యత్తు కోసం విద్యార్థులు దృఢ సంకల్పంతో సరైన ప్రణాళికతో శ్రమించాలి

### జిల్లా ఎస్పీ ఏఆర్ దామోదర్




**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జులై 7)**

జీఈఈ అడ్వాన్స్ పరీక్షలో ప్రకాశం జిల్లా విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనపరిచారు. వారిలో కె షణ్ముఖ సాయి రెడ్డి , ఎస్వీసాయి చక్రి , 3వ ర్యాంక్), అబ్దుర్రహీమ్, సాకేత్ రామ్ లను జిల్లా ఎస్పీ సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రత్యేకంగా అభినందించి, శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ ఐఐటీ వంటి ప్రతిష్టాత్మక కళాశాలల్లో సీట్లు సాధించటం అభినందనీయమని, పిల్లలుపై చదువుల్లో ఎలాంటి ఒడిదుడుకులు లేకుండా చక్కగా చదువుకోవాలని, ఇదే పట్టుదల, కృషి తో ఎంచుకున్న లక్ష్యాన్ని ఛేదించాలని ఆకాక్షించారు. దృఢ సంకల్పం, సరైన ప్రణాళిక, సమయ పాలన మరియు కఠోర కృషితో చదవడం ద్వారా విద్యార్థులు జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోయించగలరని, చదువుకునే రోజుల్లోనే సరైన ప్రణాళికను నిర్దేశించుకొని ఉన్నత విద్యతో బంగారు భవితకు బాటలు వేసుకోవాలని సూచించారు. చదువుల్లో ప్రతిభ చాటుతూ వారి తల్లిదండ్రులకు, జిల్లాకే కాక, రాష్ట్రనికి మంచి పేరు తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో భాష్యం స్కూల్ ప్రిన్సిపాల్ వెంకటరమణ, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# పిఎం సూర్యఘర్ లక్ష్యాలను వేగంగా పూర్తి చేయాలి

### జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి

**(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, బాపట్ల, జులై 7)**

జిల్లాలో పి.ఎం.సూర్య ఘర్ పథము క్రింద ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను వేగవంతం గా పూర్తి చేయడానికి చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పీఎం సూర్యఘర్ పథకాన్ని పూర్తిస్థాయిలో ఆమలు చేయడానికి మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, డివిజనల్ అభివృద్ధి అధికారులు సంయుక్తంగా కృషి చేయాలని ఆయన చెప్పారు. పీఎం సూర్య ఘర్ కార్యక్రమం రిజిస్ట్రేషన్లు ముందంజలో ఉన్న జె. పంగులూరు మరియు నగరం మండల పరిషత్ అభివృద్ధి అధికారులను జిల్లా కలెక్టర్ అభి నందించారు. సంతమాగులూరు, మార్టూరు, కొరిశపాడు, కొల్లూరు, బాపట్ల, వేమూరు మండల పరిషత్ అభివృద్ధి అధికారులు సూర్యఘర్ రిజిస్ట్రేషన్లు చేయడం లో నిర్లక్ష్యంగా ఉన్నారని పద్ధతి మార్చుకోవాలని కలెక్టర్ హెచ్చరించారు. మండల పరిషత్ అభివృద్ధి అధికారులు మరియు డి.ఆర్.డి.ఏ ఏ.పి.ఎంలు గ్రామస్థాయిలో ఈ కార్యక్రమం పై విస్తృత ప్రచారం కల్పించాలని ఆయన చెప్పారు. జిల్లాలో పి4 కార్యక్రమం బాగా ఆమలు జరిగిందని ఈ విషయంపై ముఖ్యమంత్రి నుండి



అభినందనలు వచ్చాయని కలెక్టర్ చెప్పారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ప్రజల నుండి వచ్చిన అర్జీలను వెంటనే పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి జి గంగాధర్ గౌడ్, డి.ఆర్.డి ఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీనివాసరావు, డ్వామా ప్రాజెక్ట్ డైరెక్టర్ విజయలక్ష్మి, జిల్లా పంచాయతీ అధికారి ప్రభాకర్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ విజయమ్మ, గృహ నిర్మాణ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ వెంకటేశ్వర రావు, జిల్లారవాణా శాఖ అధికారి పరంధామరెడ్డి, జిల్లా పౌర సరఫరాల శాఖ జిల్లా మేనేజర్ శివ పార్వతి, జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి రాధా మాధవి, బాపట్ల రెవెన్యూ డివిజన్ అధికారి పి గ్లోరియా, తదితరులు పాల్గొన్నారు.

# సంపద సృష్టితో అభివృద్ధి, సంక్షేమం

- పరుగులెత్తిస్తున్న సీఎం చంద్రబాబు
- ఎవరైనా చనిపోతే తప్ప జగన్ బయటకు రావడం లేదు
- ఆయనకు అదేం రోగమో అర్థం కావడం లేదు
- జగన్ పరామర్శల పేరుతో ప్రజల ప్రాణాలు తీస్తున్నారు
- సింగరాయకొండలో రైల్వే బ్రిడ్జి నిర్మిస్తాం
- ఇనాం భూముల సమస్య పరిష్కారానికి మంత్రివర్గ ఉపసంఘం నియమించాం
- మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి
- రూ.27 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డు ప్రారంభించిన మంత్రి



**(షణ్ముఖ వెలుగు, కొండపి ఇన్‌ఛార్జి, జులై 7)**

జగన్ చేసిన అప్పులు తీర్చుకుంటూ సంపద సృష్టితో సీఎం చంద్రబాబు నాయుడు రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమాన్ని పరుగులెత్తిస్తున్నారని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి అన్నారు. సోమవారం సింగరాయకొండలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి ఇంటింటికి తిరిగి కరపత్రాలు పంచుతూ ఏడాదిలో కూటమి ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా గ్రామంలో రూ.27 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డు మంత్రి ప్రారంభించారు. అనంతరం మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి మాట్లాడుతూ జగన్ చేసిన అప్పులు తీర్చుతూ సంపద సృష్టితో చంద్రబాబు నాయుడు రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమాన్ని పరుగులెత్తిస్తున్నారు. రాష్ట్రం ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్నా ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ అమలు చేస్తున్నాం. దేశంలో ఏ రాష్ట్రం చేయని విధంగా ప్రజలకు సంక్షేమం అందిస్తున్నాం. ఇనాం భూముల సమస్య పరిష్కారానికి (తరువాయి 4లో...)

# ఘనంగా ఎంఆర్‌పీఎస్ 31వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



**(షణ్ముఖ వెలుగు, పొదిలి, జులై 7)**

ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు, మాదిగ జాతి అభివృద్ధికి కృషి చేస్తున్న ధీశాలి, మాదిగ జాతిలో చైతన్యం నింపిన మేధావి, ఎస్సీ వర్గీకరణ సృష్టికర్త, వర్గీకరణ సాధకుడు, మాదిగ జాతి ముద్దు బిడ్డ పద్మశ్రీ మందా కృష్ణ మాదిగ జన్మదినం, ఎంఆర్‌పీఎస్ 31వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. పొదిలి మండలం ఎంఆర్‌పిఎస్ నాయకులు, స్థానిక ఏబీఎం స్కూల్ వద్ద బాబు జగజ్జీవన్ రామ్, డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించి, జెండాను ఎగుర వేసి నినాదాలు చేశారు. అనంతరం కేక్ కట్ చేసి అందరూ మందకృష్ణ మాదిగకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ముక్కర కిరణ్, వేల్పుల సురేష్, బూదాల బెంజిమెన్, తంగిరాల ఆఫీరస్, కరాటపు ఐజక్, ఆదిమూలపు రవి, సీనియర్ నాయకులు వేల్పుల నెహెమ్యా, గురిజాల శాంత, గుంటగాని ఎలీషా, పందిటి యేసేబు, కొమ్ము శ్యాం బాబు, మల్లెల శ్యాం, గంగవరపు నాగులు, గురిజాల చక్రవర్తి, రావినూతల నాగరాజు, గజ్జ బాబు, వేల్పుల చైతన్య, గంగవరపు జేమ్స్ సుభాష్, శిరీగూరి నవీన్, మల్లెల సందీప్, ముక్కర నితిన్, ఎడ్లపల్లి నీరజ్, ముక్తిపూడి డానియల్, జి ఆరోన్, వి అచ్చయ్య, వి ఎలీష, తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయునికి ఘన సన్మానం



**(షణ్ముఖ వెలుగు, కంభం, జులై 7)**

మండలంలోని పెద్ద నల్లకాల్వ ప్రాథమిక పాఠశాల నుంచి బదిలీపై వెళ్ళిన ఉపాధ్యాయులు ఎస్ఏ ఖాదర్‌ను ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు, పాఠశాల సహెుపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు ఖాదర్ విద్యా సేవలను గుర్తుచేస్తూ, పాఠశాల అభివృద్ధికి ఆయన చేసిన కృషి ప్రశంసనీయమని అభినందించారు.

# ప్రభుదాస్‌కు అభినందనలు



**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జులై 7)**

జిల్లా పోలీసు కార్యాలయంలోని పరిపాలనా విభాగంలో పని చేస్తున్న సీనియర్ అసిస్టెంట్ ఏ ప్రభు దాసు ఆఫీస్ సూపరింటెండెంట్ గా పదోన్నతి పొంది సోమవారం జిల్లా ఎస్పీ కార్యాలయంలో జిల్లా ఎస్పీ ఏ ఆర్ దామోదర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎస్పీ ఏ ప్రభుదాస్‌కు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పదోన్నతులు మరింత బాధ్యతను పెంచుతాయని, ఇకపై మరింత నిబద్ధతగా విధులు నిర్వర్తించాలన్నారు. పదోన్నతి పొంది ఏపి 6 బెటాలియన్ మంగళగిరికి బదిలీపై వెళ్లి అక్కడ ఆఫీస్‌లో కూడా సిబ్బందికి ఉత్తమ సేవలు అందించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఏఓ రామ్మోహన్ రావు, డిపిఓ సిబ్బంది పాల్గొన్నారు.

# బంగారు భవిష్యత్తు కోసం విద్యార్థులు దృఢ సంకల్పంతో సరైన ప్రణాళికతో శ్రమించాలి







# సంపద సృష్టితో అభివృద్ధి, సంక్షేమం

మంత్రివర్గ ఉపసంఘం నియమించాం. సింగరాయకొండలో రైల్వే బ్రిడ్జి నిర్మిస్తాం. కూటమి ప్రభుత్వం చేసిన అభివృద్ధి సంక్షేమం ప్రజలకు కనిపిస్తున్నా వైసీపీ నేతలకు కనపడకపోవడం సిగ్గుచేటు. జగన్ మాట్లాడితే ప్రభుత్వాన్ని రీ కాల్ చేయాలంటున్నారు. జగన్ నే రీకాల్ చేసేందుకు వైసీపీ క్యాడర్ సిద్ధంగా ఉన్నారు. ఎవరైనా చనిపోతే తప్ప జగన్ బయటకు రావడం లేదు, ఆయనకు అదేం రోగమో అర్థం కావడం లేదు. జగన్ పరామర్శల పేరుతో ప్రజల ప్రాణాలు తీస్తున్నారు. బెట్టింగ్ తో చనిపోయిన వారి పరామర్శకు వెళ్లి ముగ్గురిని బలి తీసుకున్నారు. శవ రాజకీయాలు చేయడానికి జగన్ కి శవాలు కావాలి, మాకు అభివృద్ధి కావాలి. ఏడాదిలోనే ప్రజలకు ఎన్నో అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు చేశామని, కూటమి ప్రభుత్వాన్ని ప్రజలంతా నిండు మనస్సుతో ఆశీర్వదిస్తున్నారని మంత్రి డా. డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి అన్నారు.

# అక్షర ఆంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలి

ఆడియో విజువల్, 40 గంటలు తరగతి బోధన, 45 గంటలు సాధన ఉంటుందని తెలిపారు. ఫంక్షనల్ లిటరసీ, డిజిటల్ మరియు ఫైనాన్షియల్ లిటరసీ కోసం 42 డిజిటల్ వీడియోలను మొబైల్ ఫోన్ ద్వారా వయోజన విద్యాశాఖ అందజేస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు జిల్లా పరిషత్, డీఆర్డిఏ, మెప్మా, ఐసిడిఎస్, పంచాయతీ, విద్య, గ్రామ, వార్డు సచివాలయ సిబ్బందిని క్షేత్రస్థాయిలో భాగస్వాములను చేసినట్లు వివరించారు. దీనిపై కలెక్టర్ స్పందిస్తూ మండల స్థాయిలో జరిగే శిక్షణకు పంచాయతీ కార్యదర్శులు, వెల్ఫేర్ అసిస్టెంట్లు, ఇతర సచివాలయ సిబ్బంది మరియు గుర్తించబడిన వాలంటీర్ టీచర్లు హాజరయ్యేలా చూడాలని సంబంధిత శాఖల ఉన్నతాధికారులను ఆదేశించారు. ఆగస్టు 7 నుంచి రాష్ట్రవ్యాప్తంగా బోధన ప్రారంభమయ్యేలా ప్రభుత్వం కార్యాచరణ ప్రణాళిక రూపొందించినందున, దీనికి సంబంధించిన వాలంటీర్ టీచర్ల గుర్తింపు, శిక్షణ కార్యక్రమాలను ప్రణాళిక మేరకు ఈ నెలలో పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో జడ్పీ సీఈవో చిరంజీవి, డీఈవో కిరణ్ కుమార్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



# ఈ ప్రభుత్వం మాటమీద నిలబడే ప్రభుత్వం

## సుపరిపాలనలో తొలి ఏడాది కార్యక్రమంలో మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి

**(షణ్ముఖ వెలుగు, మార్కాపురం ఇన్‌ఛార్జి, జులై 7)**





ఈ ప్రభుత్వం మాట మీద నిలబడే ప్రభుత్వం అని మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి అన్నారు. సోమవారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా మార్కాపురం పట్టణంలోని 12 వ వార్డ్, మార్కాపురం మండలంలో రాయవరం గ్రామం, కొనకనమిట్ల మండలంలో వద్ది మడుగు గ్రామంలో పార్టీ శ్రేణులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్ళి పాంప్లెట్లు పంచి బూత్ ఇన్‌ఛార్జిలతో మై టిడిపి యాప్‌లో ఆ కుటుంబాల వివరాలు నమోదు చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వం రాష్ట్రాన్ని ఆర్థికంగా దివాలా తీయించిందని అయినా కూడా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తొలి ఏడాదిలోని తమ హామీలకు కట్టుబడి కుటుంబంలో ఎంతమంది విద్యార్థులు ఉన్న అంతమంది విద్యార్థులకు తల్లికి వందనం పథకాన్ని అమలు చేశారని, ప్రతి విద్యార్థి తల్లులు ఎకౌంట్లో ఒక్కో విద్యార్థికి పదవులు వేల రూపాయలు జమ చేశారని అన్నారు. ఎన్టీఆర్ భరోసా పెన్షన్లతో వృద్ధులు వితంతువులకు నెలకు రూ.4,000లు, దివ్యాంగులకు రూ.6,000లు, కిడ్నీ కాలేయం తలసేమియా వ్యాధిగ్రస్తులకు నెలకు రూ.10,000లు, పూర్తి వైకల్యం ఉన్నవారికి రూ.15 వేలు గా మొత్తం గా రాష్ట్రంలో 65 లక్షల మంది లబ్ధిదారులకు పెన్షన్లు ఇస్తున్నారని అన్నారు. తమ ఎలక్షన్ల హామీ అయినటువంటి అర్హత కలిగిన ప్రతి కుటుంబానికి సంవత్సరానికి మూడు గ్యాస్ సిలిండర్ లు ఇస్తున్నారని అన్నారు. యువతకు 16,347 పోస్టులతో డీఎస్సీ నియామకాలు త్వరలోనే చేపట్టబోతున్నారని, పోలీస్ శాఖలు నియామకాలు జరిపారని, పారిశ్రామిక రంగంలో 8.5 లక్షల మంది ఉద్యోగాల కల్పనకు ఒప్పందాలు జరిగాయని అన్నారు. ఆగస్టు 15 నుండి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం సదుపాయం కల్పించబోతున్నారని అన్నారు. రైతు సంక్షేమం కొరకు కేంద్రంతోపాటు రాష్ట్ర నిధులు జోడించి అన్నదాత సుఖీభవ పథకం త్వరలోనే ప్రారంభం అవుతుందని అన్నారు. అన్నా క్యాంటీన్లను పునరుద్ధరించి కేవలం ఐదు రూపాయలకే న్యాయమైన భోజనం అందిస్తున్నారని అన్నారు. ఒక్క సంవత్సరంలోనే రాష్ట్రానికి పలు బహుళ జాతి కంపెనీలను తీసుకువచ్చి వేల సంఖ్యలో ఉద్యోగ కల్పన చేశారని అన్నారు. గత వైసిపి పాలకులు పూర్తికాని వెలుగొండ ప్రాజెక్టును జాతికి అంకితం చేశారని, ఇంకా రూ.4,000 కోట్లు ఖర్చు చేస్తేనే ఆ ప్రాజెక్టు పూర్తి అవుతుందని త్వరలోనే ఆ ప్రాజెక్టును పూర్తి చేస్తామని అన్నారు. త్వరలోనే ప్రత్యేక మార్కాపురం జిల్లా సకారం చేస్తామని అన్నారు. టిడిపి శ్రేణులు వైసీపీ తప్పుడు ప్రచారాన్ని తిపి కొట్టాలని కార్యకర్తలకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఆయా బూత్ ఇన్చార్జిలు, యూనిట్ ఇంచార్జిలు, క్లస్టర్ ఇంచార్జిలు పాల్గొన్నారు.



# ఎమ్మెల్యే దామచర్లను సత్కరించిన గోల్డ్ మర్చంట్ అసోసియేషన్



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జులై 7)

సుపరిపాలన తొలి అడుగులో భాగంగా గాంధీ రోడ్డుకు వచ్చిన ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌కి గోల్డ్ మర్చంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సభ్యులు దామచర్ల జనార్ధన్‌ను సత్కరించారు. అలాగే ఇటీవల నగర పార్టీ అధ్యక్షులుగా ఎన్నుకోబడిన బండారు మదన్‌కి కూడా శుభాకాంక్షలు తెలుపుతూ సత్కరించారు.



# పాఠశాలల విలీనం పేరుతో దళితులను ప్రభుత్వ విద్యకు దూరం చేయొద్దు

### వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కంకణాల ఆంజనేయులు




(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జులై 7)

నూతన విద్యా విధానంలో భాగంగా పాఠశాలలను వీలీనం చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని నిరసిస్తూ వ్యవసాయ కార్మిక సంఘం, ఎస్ఎఫ్ఐ ప్రకాశం జిల్లా కమిటీల ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ వద్ద ధర్నా జరిగింది. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కంకణాల ఆంజనేయులు మాట్లాడుతూ మోడల్ స్కూల్స్ పేరుతోటి నాణ్యమైన విద్యను అందిస్తానని చెబుతూ రాష్ట్ర ప్రభుత్వం ఈపాటికే ఉన్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలను మూత వేయటానికి నిర్ణయం తీసుకోవడం ఆందోళనకరమని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 12 వేల పాఠశాలలు మూత పడుతున్నాయని, ప్రతి మండలంలో పది నుంచి 15 స్కూళ్లు మూతపడుతున్నట్లు ఆయన తెలిపారు. అందులో అత్యధిక శాతం దళితులు బలహీనవర్గాల పేదల నివసిస్తున్న ప్రాంతంలోని స్కూళ్లు అని అన్నారు. హనుమంతునిపాడు మండలం లో 15 స్కూళ్ళు మూత వేస్తుండగా అందులో 12 స్కూళ్ళు దళితవాడలోనివి అని ఆయన అన్నారు. ఉన్న ఊర్లో స్కూలు మూసివేసి రెండు మూడు కిలోమీటర్ల దూరంలోని వేరే గ్రామానికి చిన్నపిల్లలు నడిచి వెళ్ళటం అసాధ్యమైన పనిని ఆ ఊరికి ఈ ఊరికి మధ్యలో అనేక వాగులు, వంకలు చెరువులు ఉంటాయని రవాణా సౌకర్యం పరిమితంగా ఉంటుందని అన్నారు. ఆ దూరపు స్కూళ్లకు పంపలేక ప్రైవేటు విద్యను కొనలేక దళితుల బిడ్డలు చదువుకు దూరం అవ్వాల్సిన పరిస్థితి దాపురిస్తున్నదని అన్నారు. గత 20 రోజులుగా తమ నివాస ప్రాంతంలోని పాఠశాలను మూసివేస్తున్నారని, విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చేస్తున్నారనీ, విద్యాశాఖ అధికారులకు వినతి పత్రాలు అందచేస్తున్నారనీ, అయినా ప్రభుత్వం నుండి సానుకూలమైన స్పందన రాకపోవడంతో ఒంగోలు కలెక్టరేట్ వద్ద ధర్నాకు వచ్చారని తెలిపారు. పాఠశాల విద్య విషయంలో గత ప్రభుత్వం అనుసరించిన విధానాలనే నేటి టిడిపి కూటమి ప్రభుత్వం కూడా కొనసాగిస్తున్నది. గత ప్రభుత్వం ఆరు రకాల స్కూళ్లను ప్రతిపాదించగా కూటమి ప్రభుత్వం ఇప్పుడు తొమ్మిది రకాల పాఠశాలలను ప్రతిపాదించిందన్నారు. 14 సంవత్సరాల లోపు పిల్లలందరికీ ఉచిత, నిర్బంధ విద్య కల్పించాలని ఒకవైపు చట్టం చెబుతున్నా, దానికి విరుద్ధమైన విధానాలను క్రింది స్థాయిలో అమలు చేస్తున్నారనీ అన్నారు. మూసి వేస్తున్న పాఠశాలలన్ని దళిత కాలనీలో ఉన్నాయనీ అన్నారు. ఇది కావాలని చేస్తున్న కుట్రగా మేము భావిస్తున్నామనీ, తక్షణమే ఈ ప్రక్రియ నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ధర్నాకు అధ్యక్షత వహించిన వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బడుగు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కిలోమీటర్ లోపు ఉన్న స్కూళ్లను విలీనం చేస్తామని చెప్పిన పాలకులు హనుమంతునిపాడు మండలంలో రెండు కిలోమీటర్ల పైగా ఉన్న స్కూళ్లను కూడా మూసివేస్తున్నారని అన్నారు. కోట తిప్పల, మంగ పల్లి, పాపిరెడ్డిపల్లి, రసీదుపురం, ముప్పలపాడు తదితర గ్రామాలలో 20 మంది పైగా పిల్లలు ఉన్న నిబంధనలకు విరుద్ధంగా ఆ స్కూల్లు మూసేస్తున్నారని అన్నారు. తల్లిదండ్రులు ఉపాధి కోసం వలస పోతే వారి బిడ్డలని ముసలి ముతక ఇంటి ముందున్న స్కూల్లో చదివించుకుంటూ అలనా పాలన చూస్తున్నారని తెలిపారు ఈ స్కూల్లో మూసివేతతో వాళ్లు శాశ్వతంగా చదువులకు దూరం అవుతారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బండి వీరాస్వామి మాట్లాడుతూ రాష్ట్రంలో అధికారంలో ఉన్న టిడిపి కూటమి ప్రభుత్వం జీవో నెం.117 రద్దు చేసినప్పటికీ, ఇంతకు ముందు ప్రభుత్వం ప్రారంభించిన సంస్కరణలనే కొనసాగిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం అమలులోకి తెచ్చిన జాతీయ విద్యా విధానం-2020ను గత వైసిపి ప్రస్తుత టిడిపి కూటమి ప్రభుత్వం పోటీపడి అమలు చేస్తున్నాయన్నారు. దీనితో పాటు ప్రపంచ బ్యాంక్‌తో చేసుకున్న 'సాల్ట్' వంటి ఒప్పందాలు పాఠశాల సంఖ్యను, ఉపాధ్యాయ సంఖ్యను తగ్గించాలని స్పష్టంగా నిర్దేశించాయనీ, అందులో భాగంగానే కూటమి ప్రభుత్వం కూడా సంస్కరణల పేరుతో పాఠశాలలను కుదించటానికి పూనుకున్నదన్నారు. ప్రభుత్వం నిర్ణయాన్ని వెనక్కి తీసుకోకపోతే పాఠశాలల మూసివేతకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున పోరాటాలు నిర్వహిస్తామని తెలిపారు. కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి బి.రఘురాం మాట్లాడుతూ.... దళితులకు విద్యను దూరం చేసే కుట్రలో భాగంగా ఈ నూతన జాతీయ విద్యా విధానం తీసుకువచ్చారన్నారు. ఈ చట్టాన్ని దేశంలో మొట్టమొదటిసారిగా అమలు చేస్తామని చెప్పింది గత వైసిపి ప్రభుత్వం ప్రస్తుతం, నేటి తెలుగుదేశం కూటమి ప్రభుత్వం అని అన్నారు. దళితులకు చదువుల దూరం చేసే విషయంలో వైసిపి, టిడిపి కూటమి ప్రభుత్వాలు కేంద్ర బీజేపీ ప్రభుత్వం మెప్పును ఉంది తాపత్రయంలో ఉన్నాయి తప్ప, వారికి విద్యాబుద్ధులు నేర్పేందుకు సిద్ధం కావట్లేదని అన్నారు. దళితుల కోసం కేంద్ర ప్రభుత్వం ఇచ్చే నిధులను సైతం తమ సొంత పథకాలకు రాష్ట్ర ప్రభుత్వం వినియోగించుకుంటుందనీ, దళితుల విద్య కోసం కెవిపిఎస్ పోరాటం చేస్తుందని తెలిపారు. ఐద్వా జిల్లా కార్యదర్శి కంకణాల రమాదేవి మాట్లాడుతూ వెనుకబడిన ప్రకాశం జిల్లాలో మెరుగైన విద్యా అవకాశాలు కల్పించాల్సింది పోయి ఉన్న పాఠశాలను మూసివేయడం సరైనది కాదన్నారు. ఒకవైపు మాది మంచి ప్రభుత్వం అని చెబుతూ మరోవైపు పేదలకు చదువుల దూరం చేసే పనులను చేస్తున్నారనీ, పాఠశాలను మూసివేసిన విధానానికి వ్యతిరేకంగా పోరాడుతామని తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు నెరుసుల వెంకటేశ్వర్లు, నాయకులు అన్నవరపు శేషారావు, ఎస్ఎఫ్ఐ నాయకులు సీహెచ్ వినోద్, విజయ్, దేవ, ఆనంద్ పాల్గొన్నారు. ధర్నా అనంతరం కలెక్టర్‌కు అర్జీ ఇవ్వగా సాయంత్రమే సంబంధిత అధికారులతో మాట్లాడి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.

# మెగా పేరెంట్స్ అండ్ టీచర్స్ 2.0 సమావేశం

### పండుగ వాతావరణంలో వేడుకగా జరపాలి

### జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి

(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, బాపట్ల, జులై 7)



మెగా పేరెంట్స్ అండ్ టీచర్స్ 2.0 సమావేశం పండుగ వాతావరణంలో వేడుకగా జరపాలని జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి తెలిపారు. మెగా పేరెంట్స్ అండ్ టీచర్స్ సమావేశం నిర్వహణపై సోమవారం స్థానిక కలెక్టర్ క్యాంప్ కార్యాలయం నుంచి ఆయన వీక్షణ సమావేశం నిర్వహించారు. మెగా పేరెంట్స్ అండ్ టీచర్స్ 2.0 సమావేశాన్ని జయప్రదంగా నిర్వహించడానికి ప్రజా ప్రతినిధులను భాగస్వామ్యం చేయాలని కలెక్టర్ చెప్పారు. విద్యార్థుల తల్లిదండ్రులు, ప్రజా ప్రతినిధులకు ముందుగా సమాచారం పంపాలన్నారు. విస్తృతంగా ప్రచారం చేయాలని ఆయన సూచించారు. విద్యాశాఖ అధికారులు, ప్రధానోపాధ్యాయులు గౌరవప్రదంగా వారిని ఆహ్వానించాలన్నారు. గంజాయి, మాదక ద్రవ్యాలు అరికట్టడానికి విద్యార్థుల్లో అవగాహన కల్పించాలన్నారు. విద్యార్థుల జీవితాలను కాపాడటమే లక్ష్యం కావాలన్నారు. జిల్లా వ్యాప్తంగా 1,818 ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు ఉన్నాయన్నారు. అందులో ఒకటి నుంచి 10వ తరగతి వరకు ఒక లక్ష, 59,108 మంది విద్యార్థులు ఉన్నారని చెప్పారు. విద్యార్థి మిత్ర బహుమానాలను అందుకున్న విద్యార్థులంతా నూతన దుస్తులు ధరించి పాఠశాలకు హాజరు కావాలన్నారు. జూనియర్ కళాశాలలోనూ ఈ కార్యక్రమాన్ని నిర్వహించాలన్నారు. ఇంటర్మీడియట్ విద్యార్థులకు మొక్కలు పంపిణీ చేయాలన్నారు. 'ఏక్ పేడ్ మాకే నామ్"(అమ్మ పేరుతో ఒక మొక్క) విద్యార్థులు నాటేలా అవగాహన కల్పించాలని కలెక్టర్ చెప్పారు. పాఠశాలల ప్రాంగణాలు లేదా ఇళ్ల వద్ద నాటే మొక్కల బాధ్యత విద్యార్థులదేనన్నారు. విద్యార్థులకు అవసరమైన మొక్కలు సిద్ధంగా ఉంచామని, మంగళవారం నాటికి నర్సరీల నుండి ఆయా మండలాలకు చేరుతాయన్నారు. వాటిని విద్యార్థులకు పంపిణీ చేయాలని ఆయన సూచించారు. తల్లికి వందనం పథకం కింద నగదు పంపిణీ ప్రక్రియ జిల్లాలో జరుగుతోందన్నారు. మెగా పేరెంట్స్ అండ్ టీచర్స్ మీటింగ్ లో విద్యార్థుల ప్రగతి నివేదిక, హెల్త్ కార్డుల పంపిణీ చేపట్టాలన్నారు. షైనింగ్ స్టార్ అవార్డులు పొందిన విద్యార్థులు, పూర్వ విద్యార్థులను పిలిపించి వేదికపై మాట్లాడించాలన్నారు. విద్యార్థుల్లో స్ఫూర్తిని నింపేలా ఈ కార్యక్రమాన్ని సమర్థంగా చేపట్టాలన్నారు. ఈ సమావేశాలలో ముందస్తుగా విద్యార్థుల తల్లిదండ్రులకు వివిధ రకాల క్రీడా పోటీలు నిర్వహించాలన్నారు. పండుగ వాతావరణంలో సమావేశాలు నిర్వహించాలని అధికారులకు ఆయన పలు సూచనలు చేశారు. ఈ సమావేశంలో డిఈఓ పురుషోత్తం, ఎస్ఎస్సి ఏపీసి నాగిరెడ్డి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ విజయమ్మ, డిపిఓ ప్రభాకర్ రావు, అటవీశాఖ అధికారి వినోద్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.



# ప్రజా పిర్యాదుల పరిష్కారంలో అలసత్వం చేయకండి

### జిల్లా ఎస్పీ ఏఆర్ దామోదర్

### ప్రజా పిర్యాదుల నిర్ణీత కాలపరిమితి లోపల విచారణ చేసి బాధితులకు న్యాయం చేయాలి

### పోలీస్ గ్రీవెన్స్‌కు 79 ఫిర్యాదులు




(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జులై 7)

ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను పరిష్కారించేందుకు సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా ఎస్పీ ఏ ఆర్ దామోదర్ ప్రజా సమస్యల పరిష్కార వేదిక"(మీకోసం) కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు వారి యొక్క వ్రాతపూర్వక అర్జీలను జిల్లా ఎస్పీ గారు మరియు పోలీస్ అధికారులు స్వీకరించారు. కుటుంబ కలహాలు, భర్త, అత్తారింటి వేదింపులు, భూ వివాదాలు మరియు ఇతర సమస్యల గురించి ఫిర్యాదుదారులు అధికారులు ముందు స్వేచ్ఛగా విన్నవించారు. ఫిర్యాదుదారులతో ముఖాముఖి మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకొని, నిర్ణీత గడువులోపు విచారించి పరిష్కరిస్తామని ఎస్పీ వారికి భరోసా కల్పించారు. ఆయా ఫిర్యాదులపై సంబంధిత పోలీస్ స్టేషన్ల పరిధిలోని అధికారులతో మాట్లాడి, ఆ ఫిర్యాదులపై చట్ట ప్రకారం తగిన చర్యలు తీసుకోని, త్వరితగతిన తగిన న్యాయం జరిగేలా చూడాలని పోలీస్ అధికారులను జిల్లా ఎస్పీ ఆదేశించారు.

**వచ్చిన ఫిర్యాదుల్లో కొన్ని....** ఒంగోలు మారుతి నగర్‌కు చెందిన ఓ వ్యక్తి తన వద్ద ఉన్న మూడు కార్లను బాడుగకు తీసుకున్న ఒంగోలు సమతా నగర్‌కు చెందిన వ్యక్తి, 'ఒంగోలు సమీపంలో కొత్తగా ఒక వెంచర్ ప్రారంభిస్తున్నామని చెప్పి కార్లు తీసుకుని, గత ఏడు నెలలుగా కార్ల బాడుగు డబ్బులు ఇవ్వకుండా, కార్లను కూడా తిరిగి ఇవ్వకుండా అడుగుతుంటే బెదిరిస్తున్నాడని ఫిర్యాదు చేశారు. ఒంగోలులోని ఉన్న తన యొక్క ఇంట్లో ఒంగోలుకు చెందిన ఒక ఆమె, అతని యొక్క కుటుంబ సభ్యులు అద్దెకు ఉంటూ చాలాకాలంగా అద్దె డబ్బులు చెల్లించకపోగా, ఇల్లు ఖాళీ చేయమని చెప్పితే ఖాళీ చేయకుండా బెదిరింపులకు పాల్పడుతున్నారని సంతనూతలపాడు మండలం, మంగమూరు గ్రామానికి చెందిన ఒక మహిళ ఫిర్యాదు చేశారు. ఈ ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో మహిళా పోలీస్ స్టేషన్ సీఐ సుధాకర్, ఎస్సీ, ఎస్టీ సెల్ ఇన్స్పెక్టర్ దుర్గ ప్రసాద్, ఐటి కోర్ సీఐ వి సూర్యనారాయణ, ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ పాండు రంగారావు, ప్రజా సమస్యల పరిష్కార వేదిక ఎస్ఐ జనార్దన్‌రావు, సిబ్బంది పాల్గొన్నారు.

# 25వ డివిజన్‌లోని దేవరాజు వీధి నుంచి సుపరిపాలన తొలి అడుగు

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జులై 7)

25వ డివిజన్‌లోని దేవరాజు విధి నుండి సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమాన్ని ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్ రావు ప్రారంభించారు. ఇంటింటికి వెళ్లి కూటమి ప్రభుత్వం అందిస్తున్న పథకాలు అందుతున్నాయా అని అడిగి తెలుసుకున్నారు. అదే సమయంలో ప్రజల సమస్యలను అడిగి తెలుసుకొని కొన్నింటికి అక్కడికక్కడే పరిష్కరించే విధంగా మున్సిపల్, విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి ఇంటికి, అర్హులైన ప్రతి ఒక్కరికి పథకాలు అందించడంలో కూటమి ప్రభుత్వం పని చేస్తుందని అన్నారు, ముఖ్యంగా రేషన్ కార్డులు లేవు అని, పెన్షన్లు రావడం లేదు తెలపడం జరిగిందని, గత ప్రభుత్వం చేసిన తప్పు వల్లే అర్హులైన వాళ్ళకి అందట్లేదని సమస్యను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దృష్టి తీసుకెళ్లి సమస్య పరిష్కరిస్తామని అన్నారు. ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్‌రావు వెంట ఒంగోలు నగర మేయర్ గంగాడ సుజాత, డిప్యూటీ మేయర్ వేమూరి బుజ్జి, టీడీపి నగర అధ్యక్షుడు బండారు మదన్, 25 డివిజన్ ప్రెసిడెంట్ పులివర్తి అజయ్, అబ్జర్వర్ తాత ప్రసాద్, 145 బూత్ శిఖకొల్లిసత్యనారాయణ, పప్పు శ్రీనివాసరావు, 143 బూత్ ఇంచార్జ్ తిరునల్వేలి కన్నయ్య, 139 బూత్ ఇంచార్జ్ పబ్బిశెట్టి సురేష్ డివిజన్ సెక్రెటరీ పబ్బిశెట్టి భాస్కర్, సాక్షి సుజాత, సీనియర్ నాయకులు పీఎస్ బాబు, నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.






## పది మంది హెడ్ కానిస్టేబుళ్ళు ఏ ఎస్ఐలుగా పదోన్నతి

### పదోన్నతితో ప్రజలకు ఇంకా మెరుగైన సేవలందించాలి

**జిల్లా ఎస్పీ ఏఆర్ దామోదర్**





**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జులై 7)**

ప్రకాశం జిల్లాలో వివిధ పోలీస్ స్టేషన్లలో ఉన్న ఖాళీల ఆధారంగా 10 మంది హెడ్ కానిస్టేబుల్స్ కు అసిస్టెంట్ సబ్-ఇన్స్పెక్టర్ గా పదోన్నతి కల్పిస్తూ జిల్లా ఎస్పీ గారు సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో వారికి పదోన్నతి ఉత్తర్వులను అందజేశారు. పదోన్నతులు పొందిన వారిని జిల్లా ఎస్పీ అభినందించారు. ఈ సందర్భంగా ఎస్పీ వారితో మాట్లాడుతూ పోలీస్ శాఖలో విధులు నిర్వర్తిస్తూ పదోన్నతి పొందడం గొప్ప విషయమని, పదోన్నతి పొందిన మీరు మరింత నిబద్ధతతో, అంకితభావంతో విధులు నిర్వర్తించాలని, పోలీస్ స్టేషన్లను ఆశ్రయించే బాధితులకు అండగా ఉంటూ, వారికి త్వరితగతిన న్యాయం అందించేందుకు కృషి చేయాలని, పోలీస్ శాఖ ప్రతిష్ట ఇనుమడింప చేసేలా విధులు నిర్వర్తించాలని సూచించారు. విధి నిర్వహణలో శాఖాపరమైన సహకారం అందించడానికి ఎల్లవేళలా సిద్ధంగా ఉన్నామని తెలిపారు. విధి నిర్వహణలో అవసరమైన అన్ని శాఖాపరమైన సహాయ సహకారాలు అందించడానికి తమ శాఖ ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటుందని ఎస్పీ తెలిపారు. నూతనంగా పదోన్నతి పొందిన ఏఎస్సైలు ప్రజలతో స్నేహపూర్వక వాతావరణాన్ని పెంపొందించాలని, శాంతిభద్రతల పరిరక్షణలో కీలక పాత్ర పోషించాలని సూచించారు. ఈ పదోన్నతులు వారి బాధ్యతలను పెంచుతాయని, వాటిని సమర్థవంతంగా నిర్వర్తించి ప్రజల మన్ననలు పొందాలని ఎస్పీ ఆకాంక్షించారు.పదోన్నతి పొందిన పోలీస్ సిబ్బంది జిల్లా ఎస్పీకి ప్రత్యేక హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. హెడ్ కానిస్టేబుల్ నుంచి ఏఎస్ఐలుగా పదోన్నతి పొందిన వారిలో టి ఇన్నయ్య (పొన్నలూరు), టి మాల కొండయ్య (పొన్నలూరు), వై డేనియల్ (ఎస్పీఎస్, నెల్లూరు), సీహెచ్ భాస్కర్‌రావు (ఒంగోలు విఆర్), జి కృష్ణ మూర్తి (ఒంగోలు తాలూకా ) కె కోటేశ్వరరావు (ముండ్లమూరు), కె హరిబాబు (డిసిఆర్‌బి ఒంగోలు), బి శ్రీనివాసరావు (బాపట్ల), పి ప్రసాదరావు (చీమకుర్తి), వై శ్రీనివాసరావు (కనిగిరి) ఉన్నారు.

## గుడ్ టచ్ - బ్యాడ్ టచ్ పై అవగాహన



**(షణ్ముఖ వెలుగు, కంభం, జులై 7)**

ప్రకాశం జిల్లా ఎస్పీ ఏ ఆర్ దామోదర్ ఆదేశాల మేరకు కంభం పట్టణంలోని వాసవి జూనియర్ కళాశాల విద్యార్థినీ విద్యార్థులకు కంభం సిఐ మల్లిఖార్జున, ఎస్ఐ నరసిం ఎస్సై నరసింహారావు గుడ్ టచ్ బ్యాడ్ టచ్, డ్రగ్స్, సైబర్ నేరాలు, రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై నరసింహారావు



మాట్లాడుతూ మీ తల్లితండ్రులు మీమీద ఎంతో ప్రేమతో నమ్మకంతో మీరు భవిష్యత్తులో ఎంతో ఉన్నత శిఖరాలను చేరుకోవాలని ఎంతో కష్టపడి మిమ్మల్ని చదివిస్తున్నారని కనుక మీరు ఎలాంటి చెడు వ్యసనాలకు బానిసలు కాకుండా బాగా చదువుకొని మీ తల్లితండ్రులకు మంచిపేరు తీసుకొని రావాలని డ్రగ్స్ , మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలని మైనర్ బాలురు ఎలాంటి వాహనాలు నడపరాదని డ్రైవింగ్ పై అవగాహన లేకుండా వాహనాలు నడిపితే రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరిగే అవకాశం ఉందని వాహనాలు నడిపేటప్పుడు అతివేగం కూడా ప్రమాదాలకు దారి తీస్తుందని అలాగే విద్యార్థినులు ఆకతాయిల పట్ల అప్రమత్తంగా ఉండాలని గుడ్ టచ్-బ్యాడ్ టచ్ గురించి తెలుసుకోని ఎవరైనా మీ పట్ల చెడుగా ప్రవర్తిస్తే వెంటనే స్కూల్ యాజమాన్యానికి మీ తల్లితండ్రులకు,పోలీసులకు తెలపాలని అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ నరసింహారావు తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల బృందం, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# ఖరీఫ్ 2025కి కందులు మిని కిట్స్ పంపిణీ చేసిన ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి





**(షణ్ముఖ వెలుగు, పొదిలి, జులై 7)**

మండలంలోని మూగచింతల గ్రామంలో మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి చేతుల మీదుగా రైతులకి ఆహారం, పోష కాహార పథకంలో భాగంగా 100% రాయితీ పై ఖరీఫ్ 2025 కి కందులు మినికిట్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండలంలోని అన్ని గ్రామాలకు కందులు మిని కిట్స్ పంపిణీ చేయడం జరుగుతుందని, అందరూ రైతులు సద్వినియోగించుకోవాలని ఆయన తెలిపారు. మండల వ్యవసాయ అధికారి దేవిరెడ్డి శ్రీనివాసులు మాట్లాడుతూ ఖరీఫ్ 2025 సీజన్ కి సంబంధించి ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకం కింద రైతు వాటా ప్రీమియంను రైతులే స్వతహాగా ప్రీమియం చెల్లించి నమోదు చేసుకొనే అవకాశం ప్రభుత్వం కల్పించిందన్నారు. ప్రకాశం జీల్లా లో వరి,కంది,సజ్జ, నువ్వులు, మినుములు, పత్తి, ఎండుమిరప మొదలైన పంటలును పంట బీమా పథకం కింద ప్రభుత్వం అవకాశం కల్పించినట్లుగా తెలిపారు. ఈ పంటలన్నింటికీ బీమా చెల్లించేందుకు తుది గడువు జూలై 31 వరకు మరియు వరి పంటకు ఆగస్టు 15వ తేదీ వరకు తుది గడువుగా ప్రకటించారు అని తెలియజేశారు. ప్రధాన మంత్రి ఫసల్ భీమా యోజన పథకం లో భాగంగా ఖరీఫ్ 2025 పంటల బీమాకి నమోదు చేయదలసిన రైతులు పంటలు సాగు చేసిన తరువాత రైతు యొక్క ఆధార్ కార్డు, పట్టాదారు పాస్ పుస్తకం నకలు, పంట ధ్రువీకరణ పత్రము, బ్యాంక్ అకౌంట్, ఫోన్ నెంబర్ మొదలైనవి తీసుకొని మీ దగ్గరలో ఉన్నటువంటి మీ సేవా లేదా కామన్ సర్వీస్ సెంటర్ మొదలైన చోట్ల పంటల బీమా నమోదు చేసుకోవచ్చని తెలిపారు. పై పంటలు సాగు చేస్తున్న ప్రతి రైతు తప్పనిసరిగా సాగు చేసిన పంటను ఈ పంటలో కూడా నమోదు చేసుకోవాలని రైతులను కోరారు. రైతు వాటా ప్రకారం చెల్లించాల్సిన ప్రీమియంపంటల వారిగా వరి పంటకు ఎకరానికి రూ.860లు, కంది పంటకు రూ.430లు, సజ్జ పంటకు రూ.156లు, మినుము పంటకు రూ.205లు, నువ్వుల పంటకు రూ.180లు, పత్తి పంటకు రూ.2,100లు, ఎండుమిరపకు రూ.4,500లు ఒక ఎకరాకు చొప్పున చెల్లించి పంటల బీమాలో నమోదు చేసుకోగలరని రైతులకి సూచించారు. కౌలు కి సాగు చేసుకునే ప్రతి రైతు కూడా తప్పనిసరిగా పంట సాగు హక్కు పత్రం కార్డ్స్ తీసుకోవాలని తెలియచేసారు. ఈ పంట సాగు హక్కు పత్రాలను గ్రామ రెవెన్యూ అధికారిని సంప్రదించి పొందాలని, కౌలు కార్డు ఉపయోగాలు ఈ పంట నమోదు, అతివృష్టి అనావృష్టి సమయంలలో పంట నష్టపరిహారం ఇన్సూరెన్, అదేవిధంగా పం పండించిన పంటలను మద్దతు ధరకి అమ్ముకోవడానికి, సబ్సిడీ ద్వారా విత్తనాలు పొందడానికి ఈ పంట సాగు హక్కు పత్రాలుపత్రం, ఉపయోగపడుతుంది అని వివరించడమైనది. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి దేవిరెడ్డి శ్రీనివాసులు, మండల పార్టీ అధ్యక్షులు మీగడ ఓబుల్‌రెడ్డి, మాజీ జడ్పీటిసి సభ్యులు కాటూరి వెంకట నారాయణ బాబు, మెడికల్ కౌన్సిల్ మెంబర్ డాక్టర్ స్వర్ణ గీత, పొదిలి ఏఎంసి ప్రతిపాదిత ఛైర్మన్ డాక్టర్ సయ్యద్ ఇమాంసా, టిఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి వరికుంట్ల అనిల్ (పండు), తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి ఆవులూరి యలమంద, మాదాల వారిపాలెం సొసైటీ అధ్యక్షులు యర్రంరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, ఏలూరు గ్రామ నాయకులు ఉలవా గోపి, మండల తెలుగు యువత అధ్యక్షులు పోపూరి నరేష్‌బాబు, మండల నాయకులు ఏ అంజిరెడ్డి, తలమల్ల వెంకట్రావు, సోమయ్య, స్థానిక టీడీపీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు. గ్రామ వ్యవసాయ సహాయకులు జి గురుబ్రహ్మం, వ్యవసాయ విస్తరణ అధికారి అరుంధతి, గ్రామ రైతులు పాల్గొన్నారు.

# జులై 9 దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలి

**(షణ్ముఖ వెలుగు, పొదిలి, జులై 7)**

ఈ నెల 9న దేశవ్యాప్తంగా సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యంలో పొదిలిలో సోమవారం సాయంత్రం మోటార్ బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని పొదిలి చిన్న బస్టాండ్ వద్ద సిఐటియు జిల్లా ప్రధానకార్యదర్శి యం. రమేష్ జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం ర్యాలీ పెద్దబస్టాండ్, పెద్ద మసీదు, పోలీస్ స్టేషన్, ఆర్. టి. సి. బస్టాండ్, కాలేజీ రోడ్, ఆర్. డబ్ల్యు. యస్. ఆఫీస్, వెటర్నరీ హాస్పటల్, యం. పి. డి. ఓ. ఆఫీస్,కరనూల్ రోడ్ మీదుగా విశ్వనాధపురం సెంటరుకు చేరుకుంది.ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి ఎం. రమేష్ మాట్లాడుతూ కార్మికులకు వ్యతిరేకమైన లేబర్ కోడ్స్ ను వెంటనే రద్దు చేయాలని, 8 గంటల పని విధానంలో మార్పు తీసుకొచ్చి 12 గంటల చేయడాన్ని ఆయన వ్యతిరేకించారు. అసంఘటిత కార్మికులకు సమగ్ర చట్టం రూపొందించి అమలు చేయాలని అన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా కనీస వేత చట్టాన్ని మార్పు చేయాలని అన్నారు. కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం కార్పొరేట్ల కు లాభం చేకూర్చేందుకు వ్యవహరిస్తోందని ఆరోపించారు. కార్మిక వర్గం బ్రిటిష్ కాలం నుండి పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను రద్దుచేసి నాలుగు కోడ్స్ గా తీసుకురావడంపై వ్యతిరేకించారు. కార్మిక వ్యతిరేక కోడ్స్ ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కనీస వేతన చట్టాన్ని, సమ్మె చేసే హక్కును, హరించే విధంగా, కార్మికులను యజమానులకు బానిసలుగా తయారు చేసే చర్యలు మానుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రభుత్వ స్కీముల్లో పనిచేస్తున్న స్కీం లో పనిచేస్తున్న స్కీం వర్కర్లందరినీ రెగ్యులర్ చేయాలని, కార్మికులుగా గుర్తించి కనీస వేతన చట్టాన్ని అమలు చేయాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలన్నీ వారికి వర్తింపజేయాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రభుత్వ రంగ సంస్థలు బిఎస్ఎన్ఎల్, ఇన్సూరెన్స్, పోస్టల్, రైల్వే, స్టీల్ ప్లాంట్ సంస్థలను కార్పొరేటర్ సంస్థలకు కట్టబెట్టి, కార్మికులకు ఉపాధి దూరం చేసే చర్యలకు మోడీ ప్రభుత్వం మానుకోవాలని అన్నారు. ప్రభుత్వ సంస్థలను ప్రైవేటీకరణ మానుకోవాలని అన్నారు. రైతు వ్యతిరేక నల్ల చట్టాలను వెంటనే రద్దు చేయాలని, పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని, కాంట్రాక్టర్ ఔట్సోర్సింగ్ కార్మికుల చేతవెట్టి చాకిరి మానుకొని సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని అన్నారు. ఉపాధి హామీ పథకాన్ని పట్టణ ప్రాంతాలను కూడా అమలు చేయాలని, ఉపాధి హామీ పని రోజులు పెంచాలని వారు డిమాండ్ చేశారు.జూలై 9 దేశవ్యాప్త సమ్మెలో బాగంగా ఉదయం 9 గంటలకు పొదిలి ం. ప. డి. ఓ. ఆఫీస్ నుండి తహశీల్దార్ ఆఫీసు వరకు జరిగే ర్యాలీలో అన్నిరకాల కార్మికులు, ఉద్యోగులు, స్కీంవర్కర్స్ పాల్గొని జయప్రదం చేయాలన్నారు.ఈ మోటార్ బైక్ ర్యాలీలో సిఐటియు పొదిలి మండల కార్యదర్శి బి. కోటేశ్వరావు, నాయకులు యస్. వెంకటేశ్వర్లు, కె. వి. నరసింహం, జి. నాగేశ్వరరావు, యోహాన్, రామయ్యలు పాల్గొన్నారు.





## వరల్డ్ జోనోసిస్ డే నిర్వహణ





**(షణ్ముఖ వెలుగు, వినుకొండ, జులై 7)**

పట్టణములోని ఏరియా పశువైద్యశాల నందు పశు వైద్యశాల అసిస్టెంట్ డైరెక్టర్ నేలవల్లి శ్రీరాములు జోనో సిస్ డే సందర్భంగా పట్టణంలోని సుమారు 75 పెంపుడు కుక్కలకు యాంటీ రాబిస్తీకాలను వేయించారు. ఈ సందర్భంగా ఏడి మాట్లాడుతూ జంతువుల నుండి మనుషులకు సంక్రమించు వ్యాధుల పట్ల అవగాహనను కలిగి ఉండాలన్నారు. అందువల్ల అందరూ తప్పనిసరిగా పెంపుడు జాతి కుక్కలకు, పిల్లలకు ప్రత్యేక తప్పనిసరిగా ఏఆర్‌వి వ్యాక్సిన్‌ను వేయించాలన్నారు. ర్యాబీస్ వ్యాధి, బర్డు ఫ్లూ మెదడు వాపు వ్యాధి, స్వైన్ ఫీవర్, ప్లేగ్, ఆంత్రాక్స్ మొదలగు జోనో టిక్ వ్యాధుల పట్ల అవగాహన పెంపొందించుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో వినుకొండ పశు సంవర్ధకశాఖ ఏడి నేలవల్లి శ్రీరాములు, మౌనిక, నాగరాజు, అటెండర్లు రామారావు, సుభాని, రాజు, భార్గవి, తదితరులు పాల్గొన్నారు.

# విద్యారంగా సమస్యలను పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలం

## పీడీఎస్‌యు రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎల్ రాజశేఖర్ ధ్వజం




**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జులై 7)**

ఆంధ్ర రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం గావస్తున్న రాష్ట్రంలో విద్యారంగ సమస్యల్ని పరిష్కరించడంలో కూటమి సర్కార్ పూర్తి విఫలమైందని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం పీడీఎస్‌యు రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎల్. రాజశేఖర్ రాష్ట్ర ప్రభుత్వం పై ధ్వజమెత్తారు. కేజే టు పీజీ విద్యారంగ సమస్యల పరిష్కారం కోరుతూ ఈరోజు పిడిఎస్ యూ రాష్ట్ర కార్యవర్గం ఇచ్చిన పిలుపులో భాగంగా ఒంగోలు నగరంలోని మిర్యాల పాలెం సెంటర్ వద్ద గల అంబేద్కర్ విగ్రహం వద్ద ఆయన విద్యార్థులతో కలిసి ధర్నా నిర్వహించారు. రాజశేఖర్ మాట్లాడుతూ ఆరు రకాలుగా ఉన్న పాఠశాల వ్యవస్థను తొమ్మిది రకాలుగా మార్చి మొత్తం విద్యారంగాన్ని గందరగోళం చేశారన్నారు. జీవో నెంబర్ 84, 85, 117 లను తీసుకువచ్చి పాఠశాల విలీనాన్ని, పాఠశాలలు మూసివేతకు గురవుతున్నాయి అన్నారు. మరొకవైపు టీచర్ల బదిలీలల్లో భాగంగా పశ్చిమ ప్రకాశం జిల్లాలో భారీగా టీచర్ల కొరత వేధిస్తుందన్నారు. నారా లోకేష్ తన యువగలం పాదయాత్రలో జీవో నెంబర్ 77 రద్దు చేసి, అరులైన వారందరికీ స్కాలర్షిప్లు ఇస్తానన్న హామీని అమలు చేయకుండా కాలయాపన చేస్తున్నారని, తక్షణమే ఆ జీవో ను రద్దు చేసి అర్హులైన వారందరికీ స్కాలర్షిప్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సంక్షేమం అభివృద్ధి మా రెండు కళ్ళు అంటున్న కూటమి ప్రభుత్వానికి సంక్షేమ హాస్టల్ విద్యార్థుల ఆకలి కేకలు వినిపించడం లేదా అని ప్రశ్నించారు. పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్ చార్జీలు పెంచకపోతే హాస్టల్ విద్యార్థికి ఎలా పౌష్టికాహారం అందుతుందని ప్రశ్నించారు. కనుక పెరిగిన ధరలు కనుగొనంగా మెస్ చార్జీలు రూ.3,000 పెంచాలని డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న ప్రైవేట్,కార్పొరేట్ పాఠశాలను నియంత్రించి, ఫీజుల నియంత్రణ చట్టం అమలు చేయాలన్నారు. ప్రకాశం జిల్లాకు తలమానికంగా ఉన్న ఆంధ్ర కేసరి యూనివర్సిటీ, ట్రిబుల్ ఐటీలకు నిధులు లేక విలవిలలాడుతున్నాయన్నారు. తక్షణమే రూ.100 కోట్ల లెక్కన నిధులు కేటాయించాలన్నారు.. కనుక రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ స్పందించి విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా పై సమస్యల పరిష్కార సాధనలో ఈనెల 10వ తారీఖున చలో విజయవాడ కార్యక్రమానికి విద్యార్థులు,యువకులు అధిక సంఖ్యలో హాజరు కావాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పిడిఎస్ యూ రాష్ట్ర నాయకులు సిహెచ్ సిసింద్రీ బాబు, జిల్లా అధ్యక్షులు సిహెచ్.శ్యామ్, నాయకులు కోటయ్య, సచిన్, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

# 10న మెగా టీచర్ పేరెంట్ సమావేశం

## ఇంచార్జి కలెక్టర్ ఆర్ గోపాల క్రిష్ణ



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జులై 7)

ఈ నెల 10న మెగా టీచర్ పేరెంట్ మీటింగ్‌ను జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లోనూ, జూనియర్ కళాశాలలో ఘనంగా, పండుగ వాతావరణంలో నిర్వహించేలా చర్యలు తేసుకోవాలని ఇంచార్జి జిల్లా కలెక్టర్ ఆర్.గోపాల క్రిష్ణ, అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి ఇంచార్జి జిల్లా కలెక్టర్ ఆర్.గోపాల క్రిష్ణ, నియోజక వర్గ, మండల ప్రత్యేక అధికారులు, తహసిల్దార్లు, ఎంపిడిఓలు, మండల విద్యా శాఖాదికారులతో వర్చువల్‌గా సమావేశమై ఈ నెల 10న జిల్లాలో జరగనున్న మెగా టీచర్ పేరెంట్ మీటింగ్ ఏర్పాట్లు పై సమీక్షించి, దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఇంచార్జి జిల్లా కలెక్టర్ ఆర్ గోపాల క్రిష్ణ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పిల్లలందరికీ నాణ్యమైన విద్యను అందించడానికి విద్యార్థుల సంపూర్ణ అభివృద్ధిని నిర్ధారించడానికి పాఠశాల విద్య, సమాజ భాగస్వామ్యంతో ఈ నెల 10న రాష్ట్ర వ్యాప్తంగా మెగా పేరెంట్స్ టీచర్స్ మీట్ పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అందులో భాగంగా జిల్లాలోని మొత్తం 2,955, ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లోనూ, మరియు 188 జూనియర్ కళాశాలల్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందన్నారు. గ్రామ స్థాయి నుండి జిల్లా స్థాయి వరకు ప్రజా ప్రతినిధులను ఈ కార్యక్రమానికి ఆహ్వానించాలని, అలాగే పూర్వ విద్యార్థులను, అక్కడే చదివి ఉన్నత స్థానాల్లో నిలిచిన గొప్ప వ్యక్తులను కూడా ఆహ్వానించి సన్మానించాలని సూచించారు. కార్యక్రమానికి విద్యార్థులందరూ యూనిఫామ్ వచ్చేలా చర్యలు తీసుకోవాలని, ఆహ్లాదకరమైన వాతావరణంలో 'మెగా పేరెంట్స్ మీట్' జరిగేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. విద్యార్థులు, తల్లి తండ్రులు, ప్రముఖులు పెద్దఎత్తున హాజరయ్యే అవకాశం ఉన్నందున, ఏర్పాట్లు పటిష్టంగా చేపట్టాలన్నారు. తల్లి తండ్రులు, విద్యార్థులు, ఉపాధ్యాయులతో ఫోటో సెషన్ నిర్వహించాలని, అమ్మ ప్రాముఖ్యతను తెలియజేసేలా



తల్లికి వందనం నిర్వహించాలన్నారు. ఈ సమావేశం లోపలే విద్యార్థులందరికీ వైద్య పరీక్షలు జరిపి వారి ఆరోగ్య స్థితి పై 10 న వారికీ అందించే హోలిస్టిక్ కార్డ్స్ నందు రిమార్క్స్ కాలం లో రిపోర్ట్ చేసి ఇచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. నియోజక వర్గ, మండల ప్రత్యేక అధికారులు, తహసిల్దార్లు, ఎంపిడిఓ లు, మండల విద్యా శాఖాదికారులు 10న జరిగే మెగా టీచర్ పేరెంట్ మీటింగ్ లో ఏదో ఒక స్కూల్ లో పాల్గొనాలని సూచించారు. పిల్లల లోని సృజనాత్మకతను వెలికి తీసే పలు పోటీలను నిర్వహించడం జరుగుతుందని, అలాగే తల్లి దండ్రులకు కూడా రంగోలి, టగ్ అఫ్ వార్, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి బహుమతులను కూడా అందజేసారు. మానసిక ఆరోగ్యం, సైబర్ క్రైమ్ పై అవగాహన, డ్రగ్స్ వ్యతిరేక అవగాహన సందేశాలు, పిల్లల పురోగతిపై ఇంటరాక్టివ్ సెషన్లు నిర్వహించాలన్నారు. ప్రైవేట్ పాఠశాలల్లో కూడా 'మెగా పేరెంట్స్ మీట్' కార్యక్రమం నిర్వహించేలా సంబందించి పాఠశాలల యాజమాన్యాలతో సమావేశం నిర్వహించాలన్నారు. 'మెగా పేరెంట్స్ మీట్' కార్యక్రమం ఏర్పాట్ల పర్యవేక్షణకు ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటుచేయాలన్నారు. కార్యక్రమం ఏర్పాట్ల పనులు, 10 వతేదీన 'మెగా పేరెంట్స్ మీట్' కార్యక్రమం నిర్వహణను '%ాజూూా% యాప్' లో పొందుపరచాలన్నారు. ఈ కార్యక్రమం ఉదయం 9 గంటలకు ప్రారంభమై మధ్యాహ్నం భోజనం సమయం వరకు నిర్వహించడం జరుగుతుందన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు, అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి సహపంక్తి భోజనాన్ని కూడా చేయడం జరుగుతుందన్నారు. మధ్యాహ్నం భోజనం పై తల్లిదండ్రుల నుండి అభిప్రాయాన్ని కూడా తీసుకోవడం జరుగుతుందన్నారు. ఇందుకోసం మెనూ కచ్చితంగా అమలు అయ్యేలా చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంతో పాటు గౌరవ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పిలుపుమేరకు "ఏక్ పేడ్ మాకే నామ్ పర్"అంటే తల్లి పేరుతో ఒక మొక్కను కూడా అందించి నాటడం జరుగుతుందన్నారు. ఇందుకోసం సామాజిక అటవీ విభాగం, విద్యా శాఖ సమన్వయంతో అన్ని పాఠశాలలకు మొక్కలను సరఫరా చేయడం జరుగుతుందన్నారు. అలాగే తల్లికి వందనం సంబంధించిన సమస్యలను కూడా పరిష్కరించి వారి ఖాతాలో డబ్బులు జమ అయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ వీడియో సమావేశంలో జిల్లా విద్యా శాఖాదికారి కిరణ్ కుమార్, ఆర్ఐఓ సైమన్ విక్టర్, సాంఘిక సంక్షేమ శాఖ డిడి లక్ష్మా నాయక్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా. వెంకటేశ్వర రావు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి శ్రీనివాస రావు, తదితర అధికారులు పాల్గొనగా, క్షేత్ర స్థాయి నుండి నియోజకవర్గ, మండల ప్రత్యేక అధికారులు, తహసిల్దార్లు, ఎంపిడిఓలు, మండల విద్యా శాఖాధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## మీకోసంలో 3 అర్జీలు స్వీకరణ

(షణ్ముఖ వెలుగు, పొన్నలూరు, జులై 7)



మండల కేంద్రమైన తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం మీకోసం లో వివిధ సమస్యల పై 3 అర్జీలు తహసీల్దార్ పుల్లారావుకు రైతులు అందజేశారు. సర్వే కి సంబంధించి రెండు అర్జీలు, ఆన్లైన్ కి సంబంధించి ఒక అర్జీ, రేషన్ కార్డు సంబంధించి ఒక అర్జీ స్వీకరించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయా శాఖ అధికారులు పాల్గొన్నారు.

## సుపరిపాలనలో తొలి అడుగు ఇంటింటికి తెలుగుదేశం



(షణ్ముఖ వెలుగు, పొన్నలూరు, జులై 7)

మండలంలోని చౌటపాలెంగ్రామంలో సోమవారం సుపరిపాలనలో తొలి అడుగు - ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమంలో భాగంగా ప్రతి ఇంటికి వెళ్లి ఏడాది కాలంలో కూటమి ప్రభుత్వం చేసిన అభివృద్ధి , సంక్షేమ కార్యక్రమాలను వివరించి సమస్యలను తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు మండవ ప్రసాద్, మండవ మురళి, అనుమోలు సుధాకర్, తానికొండ మహేంద్ర, యూనిట్ ఇంచార్జి ఉన్నం కొండలరావు, యర్రా నరేంద్ర, స్థానిక గ్రామ నాయకులు ఉన్నం శీనయ్య, గ్రామ పార్టీ అధ్యక్షుడు ఉన్నం వెంకటేశ్వర్లు, మాజీ ఎంపీటీసీచెన్నయ్య, తదిదర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## స్వచ్ఛ సర్వేక్షణ పై కేంద్ర బృందం పరిశీలన

(షణ్ముఖ వెలుగు, నూజండ్ల, జులై 7)

స్వచ్ఛ సర్వేక్షణ పై కేంద్ర బృందం మండలంలోని పుచ్చనూతల గ్రామపంచాయతీలో పర్యటించారు. ఈ సందర్భంగా కేంద్ర బృందం టీం సభ్యులు కె.భాస్కర్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర






ప్రభుత్వాల ఆదేశాల మేరకు గ్రామంలో పర్యటించి త్రాగునీరు, పారిశుధ్యం, ఎస్ డబ్ల్యూ పిసి షెడ్లు పనితీరు, ప్రభుత్వ కార్యాలయాలు, హెల్త్ సెంటర్లు, లబ్ధిదారుల గృహాల మరుగుదొడ్లు పనితీరు వాడకం గురించి వివరాలు స్వీకరించి గ్రేడింగ్ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిడబ్ల్యూఎస్ కన్సల్టెంట్ రమేష్, సర్పంచ్ మూడవతు శ్రావణి నాగరాజు,ఈఓపిఆర్డి షేక్ రబ్బాని, పంచాయతీ కార్యదర్శి చిట్టిబాబు, స్వచ్ఛభారత్ మండల కోఆర్డినేటర్ కంచర్ల సుబ్బరామయ్య, ఇంజనీరింగ్ అసిస్టెంట్ బలరాం పాల్గొన్నారు.

## ఘనంగా మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి ఆవిర్భావ దినోత్సవం

(షణ్ముఖ వెలుగు, వినుకొండ, జులై 7)

మాదిగ రిజర్వేషన్ పోరాడడానికి అధ్యక్షులు పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ పుట్టిన రోజు సందర్భంగా వినుకొండ బస్ స్టాండ్ వద్ద డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి కేకే కట్ చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు దాసరి కోటేశ్వరరావు మాట్లాడుతూ గత 31 సంవత్సరాల నుండి మంద కృష్ణ మాదిగ మాదిగల వర్గీకరణ కోసం మాదిగ రిజర్వేషన్ సాధించిన మాదిగ ముద్దు బిడ్డ మంద కృష్ణ మాదగ చిత్రపటానికి పాలాభిషేకం చేసి ఆయనకి అభినందనలు, శుభాకాంక్షలు తెలిపారు. ఆంధ్ర ప్రదేశ్ వైద్య మిత్ర దళిత గిరిజన కాంట్రాక్ట్ మరియు ఔట్సోర్సింగ్ ఉద్యోగుల సమైక్య రాష్ట్ర అధ్యక్షులు మాచర్ల బుజ్జి మాట్లాడుతూ ప్రధానమంత్రి, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు యొక్క కృషి ఫలితంగా ఈ రోజు మాదిగలు ఎస్సీ రిజర్వేషన్ ఏబిసిడి గా అసెంబ్లీలో ఆమోదించి విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ డీఎస్సీలో అమలు పరిచే విధంగా వారు చేసిన కృషికి ధన్యవాదాలు తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ చీఫ్ జీవి ఆంజనేయులు మాదిగలకు వెన్నుదన్నుగా ఉంటూ పదవుల్లో కూడా ప్రధాన్యతనిస్తూ నడిపిస్తున్నందుకు వారికి కూడా సభా ముఖంగా ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు సంపంగుల ప్రసాదు, నుజెండ్ల మండల తెలుగుదేశం పార్టీ ప్రధాన కర్యదర్శి బిజినెప్పల్లి బాబురావు, వినుకొండ 27వ వార్డ్ కో యూనిట్ ఇన్చార్జి చిరముల రాంబాబు, నూజెండ్ల మండలం ఎస్సీ సెల్ అధ్యక్షులు కట్టెంపుడి



భర్ణ, వినుకొండ తెలుగుదేశం పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షులు దరివేముల దాసు, ఇపురు యర్డ్ డైరెక్టర్ పాత్ర లింగ్గయ్య, బొల్లాపల్లి మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు కడియం మరియబాబు, సంపంగుల శివ, కొలకలూరి మాజీ ఎంపిటిసి మంద యేసు, పెదిటి బాల, మాచర్ల బుజ్జి, రాష్ట్ర హౌస్ కోచింగ్ అధ్యక్షుడు కొమ్ము మరియబాబు, పోలేపల్లి దిలీప్, మంద వెంకటరావు, తరితరులు పాల్గొన్నారు.

## పిజిఆర్ఎస్‌లో అందిన అర్జీలను నాణ్యతతో నిర్దేశించిన సమయంలోగా పరిష్కరించాలి

### ఇన్‌చార్జి కలెక్టర్ ఆర్ గోపాల క్రిష్ణ







(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జులై 7)

పిజిఆర్ఎస్‌లో అందిన అర్జీలను నాణ్యతతో నిర్దేశించిన సమయంలోగా పరిష్కరించాలని ఇంచార్జి జిల్లా కలెక్టర్ ఆర్.గోపాల క్రిష్ణ, అధికారులను ఆదేశించారు. సోమవారం ఒంగోలు కలెక్టరేట్‌లోని మీ కోసం సమావేశ మందిరంలో నిర్వహించిన "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" (పిజిఆర్ఎస్) కార్యక్రమంలో ఇంచార్జి జిల్లా కలెక్టర్ ఆర్. గోపాల క్రిష్ణ, జిల్లా రెవెన్యు అధికారి చిన ఓబులేసు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు వరకుమార్, శ్రీధర్, జాన్సన్, పార్ధసారధి, విజయజ్యోతిలతో కలసి పాల్గొని ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఇంచార్జి జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజాఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ ద్వారా అందిన దరఖాస్తులకు నాణ్యమైన పరిష్కారాన్ని చూపాలన్నారు. నిబంధనల మేర ఉన్న దరఖాస్తులను వెంటనే పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని, నిబంధనల మేరకు లేని దరఖాస్తులను అందుకు గల కారణాలను స్పష్టంగా ధరఖాస్తుదారుడికి తెలియజేయాలన్నారు. వివిధ శాఖల్లో నమోదైన అర్జీలను సంబంధిత అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి అర్జీదారుని సమస్యకు తగిన పరిష్కారంచూపాలని స్పష్టం చేశారు. అర్జీల పరిష్కార ప్రగతిని ఎప్పటికప్పుడు ఆన్ లైన్‌లో నమోదు చేయాలని ఇంచార్జి జిల్లా కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖలకు చెందిన జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## నవ్యాంధ్రలో నవశకానికి దిక్సూచిగా కూటమి ఏడాది పాలన

### జంగాలపల్లె సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ప్రభుత్వ చీఫ్ విప్, వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు

(షణ్ముఖ వెలుగు, నూజండ్ల, జులై 7)

జగన్ అన్నివ్యవస్థలను సర్వనాశనం చేసిన రాష్ట్రంలో కూటమి ఏడాది పాలన ప్రతి అడుగు ప్రగతి బాటలుగా నవశకానికి దిక్సూచిగా నిలుస్తోందని ప్రభుత్వ చీఫ్ విప్, వినుకొండ ఎమ్మెల్యే జీవీ అంజనేయులు అన్నారు. పన్నెండు నెలల వ్యవధిలోనే వ్యవస్థల్ని గాడిన పెట్టి పునర్నిర్మాణం దిశగా ముఖ్యమంత్రి చంద్రబాబు బలమైన పునాదులు వేశారని ఆయన స్పష్టం చేశారు.నూజండ్ల మండలం జంగాలపల్లె గ్రామంలో తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో సుపరిపాలనకు తొలి అడుగు, ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు నేతృత్వంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో, పార్టీ నాయకులు, కార్యకర్తలు గ్రామస్థుల ఇళ్లకు వెళ్లి వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ పథకాల అమలుపై అవగాహన కల్పించారు. కరపత్రాలు పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడిన చీఫ్‌విప్ జీవీ జగన్ చేసిన వ్యవస్థల విధ్వంసం, పది లక్షల కోట్ల అప్పుల వారసత్వంలో మరొకరైతే చేతులెత్తేసే వారని, కానీ చంద్రబాబు మాత్రం సవాళ్లకు ఎదురు నిలిచి సంక్షేమం, అభివృద్ధిలో సరికొత్త చరిత్ర సృష్టిస్తున్నారని కొనియాడారు. అయిదేళ్లలో జగన్ ప్రతి కుటుంబాన్ని ఏదోరూపంలో బాధపెడితే, ఏడాది లోనే ప్రతికుటుంబానికి ఏదొక రూపంలో మేలు చేయడం కూటమి ప్రభుత్వం రికార్డుగా పేర్కొన్నా రు. ప్రజలు ఇచ్చిన అద్భుత తీర్పు స్ఫూర్తిని నిలబెట్టడంలో ఇది మొదటి అడుగు మాత్రమే అన్న జీవీ రానున్న రోజుల్లో మరింత సంక్షేమం, మరింత అభివృద్ధిని అందిస్తామన్నారు. 5ఏళ్లలో 20 లక్షల ఉద్యోగాలు, ఇంటికో పారిశ్రామికవేత్త వంటి ప్రతి హామీ నెరవేర్చి తీరతామని, సీఎం చంద్ర బాబు తలపెట్టిన స్వర్ణాంధ్ర-2047కి వాటితోనే బలమైన నాంది పలుకుతామన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ మక్కెన మల్లికార్జున రావు, వినుకొండ వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ చైర్మన్ మీసాల మురళీకృష్ణ, నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.







# బాధ్యతాయుతంగా పనిచేస్తూ ప్రిన్సిపల్ పదవికే వన్నె తెస్తా

### ఏకేయూ కళాశాల నూతన ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ నిర్మలామణి

### అభినందనలు తెలిపిన సహచర ఉద్యోగులు, సిబ్బంది







(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జులై 7) మూడేళ్ళ క్రితం ఏర్పడిన ఆంధ్ర కేసరి విశ్వ విద్యాలయానికి అనుబంధంగా ఉన్న యూనివర్సిటీ కళాశాల ప్రిన్సిపాల్‌గా ఇప్పటి వరకు వైస్ ప్రిన్సిపాల్ గా పనిచేసిన ప్రొఫెసర్ ఎన్ నిర్మలామణి సోమవారం లాంఛనంగా పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ నిర్మలామణి మాట్లాడుతూ తనపై యూనివర్సిటీ ఉన్నతాధికారులు ఉంచిన బాధ్యతను సక్రమంగా నిర్వహించడమే కాకుండా తన పదవీ కాలంలో ప్రభుత్వ నిబంధనలకు లోబడి బాధ్యతాయుతంగా విధులు నిర్వహించడమే కాకుండా యూనివర్సిటీ కళాశాల ప్రిన్సిపాల్ పదవికే వన్నె తెస్తానని పేర్కొన్నారు. ఇప్పటి వరకు తాను నిర్వహించిన వివిధ హోదాలలో ఆంధ్ర కేసరి యూనివర్సిటీ ఉన్నతాధికారుల నుంచి, బోధన, బోధనేతర సిబ్బంది నుంచి మంచి సహాయ సహకారాలు లభించాయని, అదే విధంగా ప్రస్తుతం యూనివర్సిటీ కళాశాల ప్రిన్సిపాల్ హోదాలో బోధన, బోధనేతర సిబ్బంది నుంచి పూర్తి సహకారాన్ని పొందడం ద్వారా ఆంధ్ర కేసరి యూనివర్సిటీ కళాశాలలో అత్యుత్తమ ఫలితాలను సాధించేందుకు శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని ప్రొఫెసర్ నిర్మలామణి తెలిపారు.అదే సమయంలో ఆంధ్ర కేసరి యూనివర్సిటీ కళాశాల నందు విద్యార్థుల సంఖ్యను సైతం గణనీయంగా పెంపోందిచడం జరుగుతుందని ఆమె పేర్కొన్నారు ఏ.కే.యూ ఉప కులపతి ప్రొఫెసర్ డి.వి.ఆర్. మూర్తి సూచనల మేరకు ఏ.కే.యూ కళాశాల ప్రిన్సిపాల్ గా తనను నియమించిన రిజిస్ట్రార్ ప్రొఫెసర్ బి.హరిబాబుకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా నూతన ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ నిర్మలామణిని తోటి సహచరులైన ఆంధ్ర కేసరి యూనివర్సిటీ ఓ.ఎస్డి, పూర్వపు ఏ.కే.యూ. కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ గుత్తి రాజ మోహన్ రావు, ఏ.కే.యూ. పరీక్షల నియంత్రణ అధికారి (సి.ఈ), ఏకేయూ వైస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జి. సోమ శేఖరతో పాటు ఆంధ్ర కేసరి యూనివర్సిటీకి చెందిన బోధన, బోధనేతర సిబ్బంది, ప్రొఫెసర్ నిర్మలా మణి శ్రేయోభిలాషులు,స్నేహితులు, బంధు మిత్రులు హృదయ పూర్వక అభినంధనలు తెలిపారు.

## సమస్యల పరిష్కారానికే ఇంటింటికి టిడిపి ఎమ్మెల్యే బి ఎన్ విజయ్‌కుమార్







(షణ్ముఖ వెలుగు, మద్దిపాడు, జులై 7)

ప్రజల సమస్యల పరిష్కారానికే సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సంతనూతలపాడు ఎమ్మెల్యే బి ఎన్ విజయ్‌కుమార్ అన్నారు. సోమవారం మండలంలోని బూరెపల్లి గ్రామం ఎస్సి కాలనీలలో సూపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ఇంటి ఇంటికి తెలుగుదేశం కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాల కర పత్రాలను ప్రజలకు అందిస్తూ వారి సమస్యల గురించి అడిగితెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో పోతినేని శ్రీనివాసరావు (పిఎస్ఆర్), రాష్ట్ర టీడీపీ సెక్రటరీ ఆడక స్వాములు, మండల పార్టీ అధ్యక్షులు ఉప్పుగుండూరి నాగేశ్వరరావు, మండల సెక్రటరీ మందపల్లి శ్రీనివాసరావు, మండవ జయంత్ బాబు, గ్రామ పార్టీ అధ్యక్షులు బొడ్డపాటి రామకృష్ణ, గ్రామ సర్పంచ్ శేషయ్య, బొడ్డపాటి సుబ్బారావు, క్లస్టర్ ఇంచార్జి దేవబత్తిన ప్రసాద్, యూనిట్ ఇంచార్జి కాకర్ల విజయ్, కో కన్వినర్ తాతపూడి నాగరాజు, మండల, గ్రామ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## అన్నదానమే అనంతసేవ 'స్నేహహస్తం' మానవతా మాధుర్యం





(షణ్ముఖ వెలుగు, కనిగిరి టౌన్, జులై 7)

కనిగిరి ప్రభుత్వ కమ్యూనిటీ వైద్యశాలలో ఉచిత అన్నదాన కార్యక్రమం సోమవారం నిర్వహించారు. సాధారణ రోగులు, గర్భిణీలు, బాలింతలు, డయాలసిస్ చికిత్స పొందే రోగులు, వారి సహాయకులకు నాణ్యమైన భోజనం అందించారు. ఈ కార్యక్రమం సంస్థ కన్వీనర్ సుధీర్ బాబు నేతృత్వంలో కొనసాగుతుండగా ప్రతి సోమవారం జరిగే ఈ సేవా కార్యక్రమాన్ని స్థానికులు అభినందిస్తున్నారు. "అన్నదాత సుఖీభవ" అంటూ రోగులు కృతజ్ఞతలు తెలుపుతున్నారు. ఈ సందర్భంగా సుధీర్ బాబు మాట్లాడుతూ "అన్నం పరబ్రహ్మ స్వరూపం. రోగులకు, అనాధలకు, అన్నార్తులకు భోజనం అందించడం మాకు పుణ్య కార్యంగా అనిపిస్తోంది" అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ వైద్యశాల సిబ్బంది, స్నేహహస్తం చారిటబుల్ ట్రస్ట్ శ్రేయోభిలాషులు, సభ్యులు పాల్గొన్నారు.

# ఇంటింటికి తిరిగి ప్రజల సమస్యలను తెలుసుకున్న ఎమ్మెల్యే దామచర్ల

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జులై 7)

సుపరిపాలనలో తొలి అడుగులో భాగంగా ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్ రావు ఇంటింటికి తిరిగి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆరవ రోజు 24, డివిజన్లలో పర్యటించారు. 24 వ డివిజన్ లోని బండ్లమిట్టలో గల వినుకొండ అంకమ్మ తల్లి దేవస్థానంలో దామచర్ల ప్రత్యేక పూజలు చేశారు. అక్కడ నుండి ఇంటింటికి వెళ్లి సుపరిపాలన గురించి ప్రజలకు వివరించారు. అదే సమయంలో ప్రజల సమస్యలను కూడా తెలుసుకున్నారు. కంచి అరుణ అనే మహిళ తనకు వ్యాపారం చేసుకునేందుకు తోపుడు బండి కావాలని కోరగా, డీజేఆర్ ట్రస్ట్ నుండి అందిస్తామని హామీ ఇచ్చారు. ఇటీవల తిరుమలలో గ్యాస్ లీకై జరిగిన ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న రవి అనే వ్యక్తి కుటుంబాన్ని దామచర్ల పరామర్శించారు. మంగళ పాలెం మూడవ లైన్ లో పోలియోతోపాటు మానసిక స్థితి సరిగా లేక మంచానికే పరిమితమైన కోరా శీనును దామచర్ల పరామర్శించారు. బండ్లమిట్టలోని పాత బావిని ఎంఎల్ఏ పరిశీలించారు. కొన్ని దశాబ్దాల క్రితం వరకు ఈ బావి నగరంలోని ప్రజలకు ఎంతో ఉపయోగ పడిందని, దీనిని ఇలాగే వదిలేయడం వల్ల బావిలో పూడిక పెరిగి దుర్గంధం వ్యాపిస్తోందని స్థానికులు దామచర్ల దృష్టికీ తీసుకువచ్చారు. స్పందించిన ఎం ఎల్ ఏ వెంటనే మున్సిపల్ ఇంజనీర్ ను పిలిచి ఆ బావిలో పూడిక తీయించి దానిపై మెస్ పెట్టించాలని ఆదేశించారు. సమీపంలో ఉన్న వినాయకుడు పుట్టకు దామచర్ల పూజ చేసి టెంకాయ కొట్టారు. 24 వ డివిజన్ లోని డీజేఆర్ యూత్, డివిజన్ అధ్యక్షులు గుంటూరు రాంబాబు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన భారీ కేక్ ను జనార్ధన్ రావు కట్ చేశారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ గంగాడ సుజాత, నగర పార్టీ అధ్యక్షులు బండారు మదన్, డివిజన్ అధ్యక్షులు గుంటూరు రాంబాబు, డివిజన్ కార్పొరేటర్ బేతంచెట్టి శైలజ, మహిళ అబ్జర్వర్ బోనుదుర్గ, అబ్జర్వర్ రావేండ్ల జెస్సి, బీవీ వంశీధర్, జానపాటి నరేష్, గుంజి వెంకటేష్, బండారి మహేష్, డివిజన్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.







# పొదిలిలో భక్తి శ్రద్ధలతో ఘనంగా మొహర్రం పండుగ

(షణ్ముఖ వెలుగు, పొదిలి, జులై 7)

పొదిలి పట్టణంలో కులమతాలకు అతీతంగా మొహర్రం పండుగను భక్తి శ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా తూర్పు పాలెం, పడమటి పాలెం పీర్ల గుండంల వద్ద ఆదివారం రాత్రి భారీ సంఖ్యలో ప్రజలు సమకూరి, భక్తి శ్రద్ధలతో పీర్ల గుండంలో నడవడం జోరుగా సాగింది. ఇస్లామిక్ క్యాలెండర్‌లో కొత్త నెల ప్రారంభంతో పదో రోజున మొహర్రం పండుగను సంతాప దినంగా జరుపుకుంటారు. సోమవారం సాయంత్రం తూర్పుపాలెం, పడమటిపాలెం నుంచి పీర్లు పట్టణంలోని ముస్లిం ప్రాంతాలలో ఊరేగింపుగా వెళ్లాయి. ఈ సందర్భంగా హిందూ, ముస్లిం సముదాయాలు భక్తి శ్రద్ధలతో పీర్లకు స్వాగతం పలికి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక ఆంజనేయస్వామి వీధి సమీపంలోని మెయిన్ రోడ్డు పై వేలాది మంది హిందూ, ముస్లిం సోదరులు తరలివచ్చి పీర్ల అభివాద దృశ్యాలను తిలకించారు. ఈ సందర్భం మత సామరస్యానికి చిహ్నంగా నిలిచింది. ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా యస్ఐ వి వేమన ఆధ్వర్యంలో పోలీసు శాఖ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంతంగా పీర్ల ఊరేగింపు ముగిసింది





## ఎమ్మెల్యే కందుల ఆదేశాలతో ఇంటింటికి టీడీపీ నేతలు







(షణ్ముఖ వెలుగు, పొదిలి, జులై 6)

మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి అదేశాల మేరకు సోమవారం పట్టణంలోని బూత్ నెంబర్ 226 నందు సూపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని పొదిలి ఏఎంసి ప్రతిపాదిత ఛైర్మన్ డాక్టర్ సయ్యద్ ఇమాంసా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికి తిరిగి గడిచిన ఏడాదిలో కూటమి ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా కూటమి ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలను తెలియజేసే కరపత్రాలను ప్రజలకు అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు మీగడ ఓబుల్‌రెడ్డి, మాజీ జడ్పీటిసి సభ్యులు కాటూరి వెంకట నారాయణ బాబు, మెడికల్ కౌన్సిల్ మెంబర్ డాక్టర్ స్వర్ణ గీత, పొదిలి ఏఎంసి ప్రతిపాదిత ఛైర్మన్ డాక్టర్ సయ్యద్ ఇమాంసా, టిఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి వరికుంట్ల అనిల్ (పండు), తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి ఆవులూరి యలమంద, మాదాల వారిపాలెం సొసైటీ అధ్యక్షులు యర్రంరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, ఏలూరు గ్రామ నాయకులు ఉలవా గోపి, మండల తెలుగు యువత అధ్యక్షులు పోపూరి నరేష్‌బాబు, మండల నాయకులు ఏ అంజిరెడ్డి, తలమల్ల వెంకట్రావు, సోమయ్య, స్థానిక టీడీపీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

On behalf of PRINTER, PUBLISHER OWNED BY OBULASETTY RADHAKRISHNA DASS AND PRINTED AT HARI PRINTERS AND PUBLICATIONS, FLOT 51, NEAR B.V.SUBBAIAH SCHOOL ROAD, PERNAMITTA, SANTANUTALAPADU (MANDAL), PRAKASAM/ONGOLE (Dt), ANDHRA PRADESH, PIN : 523225. Mobile : 9494177939, RNI : APTEL/2023/89152, e-mail : rkreport9@gmail.com. E-Paper : shanmukhavelugu.com